Follow: @ANNTELUGU

ANN తెలుగు

31-10-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 325 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




# భారత్‌లో పెళ్లిళ్ల సీజన్

## 45 రోజుల్లో రూ.6.5 లక్షల కోట్ల వ్యాపారం

### నవంబర్ 1 నుంచి 45 రోజుల పెళ్లిళ్ల సీజన్

**ఢిల్లీ, మహా:** దేశంలో పెళ్లిళ్ల సీజన్ మరోసారి ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతాన్ని ఇవ్వనుంది. నవంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే 45 రోజుల వివాహ సీజన్‌లో దేశవ్యాప్తంగా సుమారు 46 లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయని, దీని ద్వారా ఏకంగా రూ.6.5 లక్షల కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని ఒక నివేదిక అంచనా వేసింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ పరిశోధన విభాగమైన సీఆర్‌టీడీఎస్ గురువారం ఈ నివేదికను విడుదల చేసింది.

మిగతా 2లో

## టాప్ న్యూస్

### నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్


- సుప్రీం కోర్టు 53వ సీజేఐగా సూర్యకాంత్ నియామకం
- రాష్ట్రపతి ఆమోదముద్ర.. వచ్చేనెల 24 ప్రమాణం



02

### ఎకరాకు రూ.10 వేల సాయం

- నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం
- మార్కెట్‌లో తడిచిన ధాన్యాన్ని కొనాలని ఆదేశించాం
- నేటి నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేస్తారు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా



02

### అజారుద్దీన్ పై కుట్ర

- భట్టి విక్రమార్క ఫైర్



02



జలదిగ్బంధంలో ఓరుగల్లు

# వరదలో వరంగల్ కన్నీటి ఖమ్మం

### ఓరుగల్లును ఆగం చేసిన తుఫాన్

వరంగల్ సిటీలో నీటమునిగిన వంద కాలనీలు

ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు ఉగ్రరూపం

వరద పరిస్థితులపై సీఎం రేవంత్ సమీక్ష

**వరంగల్ బ్యూరో, ఖమ్మం బ్యూరో, మహా:**

మోంథా ధాటికి వరంగల్, హనుమకొండ జిలాలు ఆగమాగం అయ్యాయి. తుఫాన్ ఓరుగల్లును పూర్తిగా ముంచెత్తింది. ట్రై సిటీస్.. కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లు నీట మునిగాయి. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరంగల్ లోని పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఖమ్మం కన్నీటిగుమ్మం అయింది. అనూహ్యవర్షాలు, వరదలతో జిల్లారైతాంగం పెద్ద ఎత్తున నష్టపోయింది. ప్రధానంగా వరంగల్ నగరంతో పాటు హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని పలు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి.

మిగతా 3లో

### శరవేగంగా సహాయక చర్యలు చేపట్టండి

- కలెక్టర్లతో పాటు అధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉండాలి
- రోడ్లు, పంట నష్టం నివేదికలను అందించండి
- తుపాను ప్రభావంపై కలెక్టర్లు ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష
- నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వేకు నిర్ణయం

02

### తెలంగాణలో రికార్డు స్థాయిలో వర్షాలు

ఏపీలో తీరం దాటిన మొంథా

తుపాన్ తెలంగాణను కూడా వణికిస్తోంది

వివరాలు 3లో

# అజారుద్దీన్ అనే నేను

### మధ్యాహ్నం గం. 12.15 లకు మంత్రిగా ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు

### రాజ్ భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు

**హైదరాబాద్, మహా :** మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రి ప్రమాణస్వీకారం చేయనున్నారు. రేపు రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. మంత్రివర్గాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిశ్చయించింది. అంతేకాకుండా ఈ విస్తరణలో



భాగంగా కాంగ్రెస్ సీనియర్ నేత అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలని కూడా ప్రభుత్వం డిసైడ్ అయినట్లు రెండు రోజులుగా వార్తలు

మిగతా 2లో

### అజారుద్దీన్‌పై బీజేపీ కుట్ర

- లోపాయికారిగా బీఆర్ఎస్ తో చేతులు కలిపిన కాషాయ పార్టీ
- మంత్రి కాకుండా అడ్డుకుంటున్న రెండు పార్టీలు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపాటు



02




# శరవేగంగా సహాయక చర్యలు చేపట్టండి

## కలెక్టర్లతో పాటు అధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉండాలి

- రోడ్లు, పంట నష్టం నివేదికలను అందించండి
- తుపాను ప్రభావంపై కలెక్టర్లు ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష
- నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వేకు నిర్ణయం



**హైదరాబాద్, మహా :** మొంథా ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను కారణంగా వాటిల్లిన ఆస్తి, ప్రాణ నష్టాన్ని త్వరగా అంచనా వేయాలని సూచించారు. మొంథా తుపాను వల్ల తీవ్ర ప్రభావానికి గురైన వరంగల్, హనుమకొండ తదితర ప్రాంతాల్లో వరద బాధితుల కోసం సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు వెంటనే అవసరమైనన్ని పడవలను పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని ఆదేశించారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో వరద సహాయక చర్యలపై రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో గురువారం మంత్రులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. అత్యవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం, హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామగ్రిని వినియోగించాలని ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వరద ప్రాంతాల్లో ఎక్కడైనా ఇండ్ల కప్పులు, బంగ్లాల్లో చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా అవసరమైన ఆహారం, మంచినీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తతతో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని చెప్పారు. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈరోజు తలపెట్టిన వరంగల్ జిల్లా పర్యటనను వాయిదా వేసుకున్న రేవంత్ శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఎక్కడా కూడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని, పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు. విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ సెక్రెటరీ అరవింద్ కుమార్, హైదరాబాద్ జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో పాటు తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలన్నారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం రైతులు నష్టపోవటం ఆందోళన కలిగించిందన్నారు. కళ్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికో ఇన్చార్జీ అధికారిని నియమించాలని, ఇప్పుడున్న ఇన్చార్జీలు నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వేరే వాళ్లను నియమించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు. అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. విధానపరమైన నిర్ణయాలు అవసరమైతే వెంటనే సివిల్ సప్లయిస్ కమిషనర్, సీఎస్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, రెవిన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టపు అంచనాలు తయారు చేయాలని నివేదించారు.

తుఫాను, వర్షాల ప్రభావమున్న జిల్లాల్లో చేపడుతున్న సహాయక చర్యలు, రోడ్లు, రహదారుల పునరుద్ధరణ చర్యలు ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఇంచార్జ్ మంత్రులు సమీక్షించాలని సీఎం కోరారు. తమ సొంత జిల్లాల్లో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, ఇన్చార్జిగా ఉన్న జిల్లాల్లో ప్రజలను ఆదుకునే చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని చెప్పారు. ఎంతటి విపత్తు వచ్చినా ప్రజలను ఆదుకునేందుకు జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలతో పాటు ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే విద్యుత్తు పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఒక డీసీఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని సీఎం అన్నారు. అన్ని రోడ్లు, రహదారులపై ఉన్న బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సీఎం అన్నారు. రోడ్లు, రహదారులపైకి వరద నీళ్లు వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. స్థానిక సీఐ, రెవిన్యూ అధికారులు వాహనాలు అటువైపు వెళ్లకుండా రెండు వైపులా బారికేడ్లు పెట్టాలన్నారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలని, కుంభ వృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వరంగల్ లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను ఆదేశించారు. వరంగల్ లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 9 రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేసి రెండు వేల మందిని పునరావాస కేంద్రాలను తరలించినట్లు ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్ర స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి వర్షాలు, వరదలు, విపత్తులు వచ్చినప్పుడు వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

**రేపు సీఎం ఏరియల్ సర్వే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఉదయం వరంగల్, హుస్నాబాద్ వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేపట్టనున్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలు, పంట నష్టం వాటిల్లిన ప్రాంతాలను సీఎం పరిశీలిస్తారు. గురువారం ఉదయమే వరద ప్రభావిత జిల్లాలకు వెళ్లేందుకు రేవంత్ రెడ్డి సిద్ధపడ్డారు. ఆఖరి నిమిషంలో సీఎం పర్యటన రద్దయింది. వాతావరణం అనుకూలించకపోవటంతో హెలికాప్టర్ ప్రయాణం వీలు కాదని ఏరియల్ సర్వేకు అధికారులు అనుమతించలేదు. ఈరోజు వాతావరణం అనుకూలించకపోవటంతో తాను రాలేకపోయానని, శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వేకు వస్తానని వీడియో కాన్ఫరెన్స్లో సీఎం ప్రకటించారు.

# ఎకరాకు రూ.10 వేల సాయం

## నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

**మార్కెట్‌లో తడిచిన ధాన్యాన్ని కొనాలని ఆదేశించాం**

**నేటి నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేస్తారు**

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా**

**ఖమ్మం, మహా:** తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున అందిస్తామన్నారు. 4.5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఖమ్మంలో మున్నేరు వరద ఉద్ధృతిని మంత్రి తుమ్మల పరిశీలించారు. మున్నేరు 26 అడుగులకు చేరిందని, ఇక పెరిగే అవకాశం లేదన్నారు. ఎగువ నుంచి వరద క్రమంగా తగ్గుతోందని తెలిపారు. మున్నేరు కరకట్టలు పూర్తయితే ఖమ్మం నగరానికి ధోకా ఉండదని చెప్పారు. రెండు రోజులుగా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. పునరావాస కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. పశుసంపద, ఇళ్లు నష్టపోయినా ఆదుకుంటామని చెప్పారు. 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 'నేటి నుంచి వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేస్తారు. నష్టపోయిన ప్రతి రైతు పంట వివరాలు నమోదు చేస్తారు. మార్కెట్‌లో తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనాలని ఆదేశించాం. 11 లక్షల టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ఆదుకుంటాం. కేంద్రం సహకరించకపోయినా ప్రతి రైతుకు అండగా నిలుస్తాం. గత ఏడాది వరదల్లోనూ భారీగా పంట నష్టం జరిగినా కేంద్రం సాయం చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక సమర్పించినా స్పందించలేదు'' అని మంత్రి తుమ్మల విమర్శించారు.

# భారత్‌లో పెళ్లిళ్ల సీజన్

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోని 75 నగరాల్లో నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ వివరాలను వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే పెళ్లిళ్ల సంఖ్యలో పెద్దగా మార్పు లేనప్పటికీ, ఒక్కో వివాహానికి చేసే ఖర్చు గణనీయంగా పెరిగిందని నివేదిక పేర్కొంది. ఒక్క దేశ రాజధాని ఢిల్లీలోనే 4.8 లక్షల వివాహాల ద్వారా రూ.1.8 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేశారు. గత పండుగ సీజన్‌లో రికార్డు స్థాయిలో జరిగిన అమ్మకాల తర్వాత వినియోగదారుల్లో పెరిగిన విశ్వాసం, ప్రజల వద్ద పెరిగిన ద్రవ్య లభ్యత, బంగారం వంటి విలువైన లోహాల ధరలు పెరగడం వంటి కారణాలతో ఈసారి వ్యాపారం భారీగా పెరిగిందని సీఏఐటీ సెక్రటరీ జనరల్, చాందినీ చౌక్ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. గతేడాది (2024లో) 48 లక్షల వివాహాల ద్వారా రూ.5.90 లక్షల కోట్ల వ్యాపారం జరగ్గా, 2023లో 38 లక్షల వివాహాలకు రూ.4.74 లక్షల కోట్లు ఖర్చు చేశారు.

**స్వదేశీ ఉత్పత్తులకే పెద్దపీట**

ఈసారి పెళ్లిళ్లలో స్వదేశీ ఉత్పత్తుల వాడకం గణనీయంగా పెరగడం ఒక ముఖ్యమైన పరిణామం. పెళ్లికి సంబంధించిన కొనుగోళ్లలో 70 శాతానికి పైగా దుస్తులు, ఆభరణాలు, అలంకరణ వస్తువులు, పాత్రలు వంటివి భారతీయ తయారీవే ఉంటున్నాయని నివేదిక హైలైట్ చేసింది. సీఏఐటీ చేపట్టిన "వోకల్ ఫర్ లోకల్ వెడ్డింగ్స్" ప్రచారం మంచి ఫలితాలనిస్తోందని, దీనివల్ల చైనా లైట్లు, కృత్రిమ అలంకరణ వస్తువుల వంటి దిగుమతులు బాగా తగ్గాయని పేర్కొంది. ఈ వివాహ సీజన్ ద్వారా సుమారు కోటికి పైగా తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు సృష్టించబడతాయని ఖండేల్వాల్ తెలిపారు. డెకరేటర్లు, క్యాటరింగ్ సిబ్బంది, పూల వ్యాపారులు, కళాకారులు, రవాణా, హాస్పిటాలిటీ రంగాల వారికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. అలాగే, టెక్స్‌టైల్స్, ఆభరణాలు, హస్తకళలు, ప్యాకేజింగ్ వంటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (MSMEs) ఇది పెద్ద ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఈ సీజన్‌లో ప్రభుత్వానికి పన్నుల రూపంలో సుమారు రూ.75,000 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. మొత్తం వ్యాపారంలో ఆభరణాల వాటా 15% ఉండగా, దుస్తులు, చీరల వాటా 10%గా ఉంటుందని తెలిపింది.

# అజారుద్దీన్‌పై బీజేపీ కుట్ర

## లోపాయికారిగా బీఆర్ఎస్‌తో చేతులు కలిపిన కాషాయ పార్టీ

**మంత్రి కాకుండా అడ్డుకుంటున్న రెండు పార్టీలు.. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపాటు**

**నిజామాబాద్, మహా :** అజారుద్దీన్ మంత్రి కాకుండా బీజేపీ కుట్ర చేస్తుందని ఇందుకు బీఆర్ఎస్ సైతం లోపాయికారి చేతులు కలిపిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో గురువారం ఏర్పాటు చెందిన మీడియా సమావేశం లో మాట్లాడుతూ క్యాబినెట్ లో మైనార్టీకి ప్రాతినిధ్యం కలిపించాలనే ఉద్దేశ్యంతో ప్రఖ్యాత క్రికెటర్ అజారుద్దిన్ ను మంత్రి మండలిలోకి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావించిందని మహేష్ కుమార్ పేర్కొన్నారు. గతంలో బీజేపీ రాజస్థాన్ లోని శ్రీ గంగానగర్ జిల్లా శ్రీ కరణ్ పూర్ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా బీజేపీ అభ్యర్థిగా ఉన్న సురేంద్ర పాల్ సింగ్ ను క్యాబినెట్ లో మంత్రిగా చేశారని గుర్తు చేశారు. ఉప ఎన్నిక అభ్యర్థిని మంత్రిగా చేస్తే తప్పులేనిది అజారుద్దీన్ ను మంత్రిని చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అజారుద్దీన్ ను కేబినెట్ లోకి తీసుకోవాలని సీఎం భావిస్తే దాన్ని అడ్డుకునేందుకు బీజేపీ కుటీల ప్రయత్నం చేస్తోందనీ మండిపడ్డారు. క్రీడా ప్రపంచానికే కాదు ఎంపీగా అజారుద్దీన్ ప్రజలకు సేవలందించారన్నారు. అజారుద్దీన్ ను మంత్రి కాకుండా ఎలక్షన్ కమిషన్ కు బీజేపీ నేతలు ఫిర్యాదు చేయడం విచారకరమన్నారు. అనైతికంగా అజారుద్దీన్ మంత్రి కాకుండా బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అజారుద్దీన్ తో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్ర గవర్నర్ పైన బీజేపీ ఒత్తిడి తీసుకువస్తోందన్న సమాచారం కూడా ఉందని తెలిపారు. బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కైందని కేసీఆర్ కూతురు కవిత స్వయంగా చెప్పారని టీ పీసీసీ చీఫ్ గుర్తు చేశారు. మైనార్టీలకు లబ్ది చేకూరుతుందనే ఉద్దేశ్యంతోనే అజారుద్దీన్ ప్రమాణ స్వీకారాన్ని బీజేపీ అడ్డుకుంటోందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞులు, కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. అజారుద్దీన్, కోదండరాంలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసి కేబినెట్ గవర్నర్ కి పంపింది. అక్కడ పెండింగ్ లో ఉందన్నారు. కోర్టులో గెలిచి తీరుతామన్న నమ్మకముందన్నారు. అజారుద్దీన్ కేబినెట్ లోకి రావడం ఖాయమని మహేష్ కుమార్ గౌడ్ ఖరాఖండిగా పేర్కొన్నారు.



## అజారుద్దీన్ పై కుట్ర

**భట్టి విక్రమార్క ఫైర్**

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ బిడ్డ, క్రికెట్ దిగ్గజం అజారుద్దీన్‌కు మంత్రివర్గంలో చోటు దక్కకుండా కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఇవ్వవద్దంటూ బీజేపీ నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడాన్ని ఆయన ఖండించారు. అజారుద్దీన్ ఎన్నో విజయాలు అందించారని ఆయన కొనియాడారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన క్రీడాకారుడిని మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖలు రాయడం దారుణమని భట్టి విక్రమార్క అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ పటంలో నిలిపిన ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుంటే అందరూ స్వాగతించాలని, కానీ ఆయనను వద్దంటూ లేఖలు రాయడమేమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసమే బీజేపీ నేతలు ఈ లేఖ రాశారని ఆయన ఆరోపించారు. గత లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సహకరించిందని అన్నారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవలేదని తెలిసే బలహీన వ్యక్తిని నిలబెట్టిందని, అదే సమయంలో అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోకుండా గవర్నర్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని ఆయన అన్నారు.

# నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

## సుప్రీం కోర్టు 53వ సీజేఐగా సూర్యకాంత్ నియామకం

**రాష్ట్రపతి ఆమోదముద్ర.. వచ్చేనెల 24 ప్రమాణం**



**ఢిల్లీ, మహా:** సుప్రీంకోర్టు కొత్త సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం అయ్యారు. అయితే ప్రస్తుతం సీజేఐగా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ ఆర్ గవాయ్ పదవీకాలం నవంబర్ 23న ముగుస్తుండటంతో.. కొత్త సీజేఐ నియామక ప్రకటన జరిగింది. 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర పడటంతో కొత్త సీజేఐగా సూర్యకాంత్ నవంబర్ 24న ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

**దాదాపు 14 నెలలపాటు ఆ పదవిలో..**

నవంబరు 24వ తేదీన సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్ 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేస్తారు. అంటే ఆయన దాదాపు 14 నెలలపాటు ఆ పదవిలో కొనసాగుతారు. ఇక చిన్న పట్టణంలో న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించి దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్.. 1962 ఫిబ్రవరి 10న హరియాణా హిస్సార్ జిల్లాలోని మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. అక్కడే 1981లో డిగ్రీ పూర్తి చేశారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్ర పట్టా పొందారు. అదే సంవత్సరం హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించారు. 1985లో పంజాబ్ హరియాణా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యేంత వరకూ హరియాణా అడ్వకేట్ జనరల్‌గా పని చేశారు. 2018 అక్టోబరు 5న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24వ తేదీన సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

**కీలక తీర్పుల్లో భాగస్వామి..**

రెండు దశాబ్దాలుగా వివిధ ధర్మాసనాల్లో పని చేసిన జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో ఆయన ఉన్నారు. దీంతోపాటు వాక్‌స్వాతంత్ర్యం, అవినీతి, బిహార్ ఓటర్ల జాబితా, పర్యావరణం, లింగసమానత్వం వంటి అంశాల్లో ఆయన కీలక తీర్పులను వెలువరించారు. బ్రిటీష్ కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని నిలిపివేస్తూ ఇచ్చిన తీర్పులో జస్టిస్ సూర్యకాంత్ భాగస్వామి. ఈ చట్టం కింద కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయవద్దని ఈ తీర్పులో ఆదేశించారు. బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణలో (సర్) భాగంగా 65 లక్షల మంది ఓటర్లను తొలగిస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై ఆయన ధర్మాసనం తీర్పు చెప్పింది. తీసేసిన వారందరి పేర్లను బహిరంగ పరచాలని ఆదేశించింది. సుప్రీంకోర్టుతోపాటు అన్ని కోర్టుల బార్ అసోసియేషన్లలో మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని ఆయన ఆదేశించారు.



# ఫైనల్‌కు టీమిండియా

**ప్రపంచకప్ సెమీస్‌లో ఆసీస్ చిత్తు,.. ఆస్ట్రేలియాపై టీమిండియా 5 వికెట్ల తేడాతో విజయం**

**సెంచరీతో జెమీమా సత్తా.. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ**

**ముంబై, మహా:** మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో ఆస్ట్రేలియాపై టీమిండియా 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ లక్ష్యాన్ని భారత్ 48.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్ (127*), హర్మన్‌ప్రీత్ కౌర్ (89) చెలరేగారు. నవంబర్ 2న ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. ఆసీస్ బ్యాటర్లలో ఓపెనర్ లీచ్ ఫీల్డ్ (119; 93 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి సెంచరీ బాదింది. ఎలీస్ పెర్రీ (77; 88 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకంతో రాణించగా.. ఆష్లీన్ గార్డ్‌నర్ (63; 45 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) చివర్లో మెరుపులు మెరిపించింది. బెత్ మూనీ (24), కిమ్ గార్త్ (17), తాహిలా మెక్‌గ్రాత్ (12) పరుగులు చేశారు. భారత బౌలర్లలో శ్రీ చరణి 2, దీప్తి శర్మ 2, క్రాంతి గౌడ్, అమన్‌జ్యోత్ కౌర్, రాధా యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

# జూబ్లీహిల్స్ లో హస్తం మాస్ స్ట్రాటజీ!

## ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ నేతలు

**సెగ్మెంట్‌లో డోర్ టు డోర్ ప్రచారంలో నేతల జోరు**

**కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా మంత్రుల ప్రచారం**

**పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తున్న ప్రజలతో మమేకం**



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని లక్ష్మీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ ప్రచారంలో రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజ నరసింహా, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు సునీత రావు, విజయ డైరీ చైర్మన్ అమిత్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జ్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయ రెడ్డి కూడా పాల్గొని ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న యువ, ప్రజా సంకల్పంతో నిండిన అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించడం ఎంతో కీలకమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు నిజమైన అభివృద్ధి, శాంతి, సామాజిక న్యాయం కావాలంటే నవంబర్ 11న జరగబోయే ఎన్నికల్లో చేతి గుర్తు కు ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీని ఘన విజయంతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు.. కార్యకర్తలు, స్థానిక నాయకులు, మహిళలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

# అజారుద్దీన్ అనే నేను

**మధ్యాహ్నం గం. 12.15 లకు మంత్రిగా ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు**

**రాజ్ భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు**

(మొదటిపేజీ తరువాయి)

వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ప్రమాణ స్వీకారానికి ముహూర్తం కూడా ఫైనల్ అయినట్లు తెలుస్తోంది. తెలంగాణ క్యాబినెట్ లో ఖాళీ ఉన్న మూడు మంత్రి పదవుల్లో ఒకదానికి అజహరుద్దీన్ కు అందించనున్నారు. అయితే ఈ మంత్రివర్గ విస్తరణను ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు మంత్రివర్గ విస్తరణ ఎలా చేస్తారని, ఇది ముమ్మాటికి ఎన్నికల కోడ్ ఉల్లంఘనే అని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే అజహరుద్దీన్ కు మంత్రి పదవి అన్న వార్తలపై బీజేపీ నాయకులు ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు కూడా చేశారు. ఈ సమయంలో అజహరుద్దీన్ ప్రమాణ స్వీకారానికి అంతా రెడీ అన్న చర్చ సంచలనంగా మారింది. ఎన్నికల కోడ్ అమలులో ఉంటే నిజంగా మంత్రివర్గ విస్తరణ ఎలా జరుగుతుంది? అందుకు ఆస్కారం ఉందా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**15గా ఉన్న మంత్రుల సంఖ్య..**

2023 డిసెంబర్ నెలలో రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత మరో ముగ్గురికి మంత్రివర్గంలో స్థానం కల్పించారు. ఈ మంత్రివర్గ విస్తరణలో అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్‌లకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది. మరో మూడు మంత్రి పదవులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి విస్తరణపై కూడా ఇప్పటికే చర్చలు జరుగుతుండగా ఇప్పుడు వాటిలో ఒకదానిని అజారుద్దీన్‌కు అందించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది.

# మొంథా తుపాన్

## తెలంగాణలో రికార్డు స్థాయిలో వర్షాలు

### ఏపీలో తీరం దాటిన మొంథా తుపాన్ తెలంగాణను కూడా వణికిస్తోంది

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అల్లాడించిన మొంథా తుపాన్ అవశేషమైన అల్పపీడనం తెలంగాణను వణికిస్తోంది. మొంథా అవశేషమైన అల్పపీడనం దక్షిణ ఛత్తీస్‌గఢ్, విదర్భ ప్రాంతంపై ఉత్తరవాయువ్య దిశగా కదులుతూ గురువారం ఉదయం 05.30 గంటల సమయానికి తూర్పు విదర్భ, పక్కనే ఉన్న దక్షిణ ఛత్తీస్‌గఢ్ ప్రాంతంపై పడిందని ఐఎండీ హైదరాబాద్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ ధర్మరాజు చెప్పారు. ఉత్తర దిశగా తూర్పు మధ్యప్రదేశ్, పక్కనే ఉన్న ఉత్తర ఛత్తీస్‌గఢ్ వైపు కదులుతూ రాబోయే 24 గంటల్లో అల్పపీడనం బలహీనపడే అవకాశం ఉందని ఆయన వివరించారు. మొంథా తుపాన్ అవశేషమైన అల్పపీడనం ప్రభావం తెలంగాణ జిల్లాలను అతలాకుతలం చేసింది. పలు ప్రాంతాలు నీట మునిగాయి. వరి, సోయాబీన్, పత్తి పంటలు దెబ్బతిన్నాయి.

**తెలంగాణలో 30 ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో అతి భారీ వర్షాలు**

మొంథా తుపాన్ ప్రభావం వల్ల వరంగల్, హన్మకొండ, కరీంనగర్, మహబూబాబాద్, జనగామ, సిద్ధిపేట జిల్లాల్లోని 30 ప్రాంతాల్లో అతి భారీవర్షాలు కురిశాయి. 204.50 మిల్లీమీటర్ల కంటే అధికంగా వర్షాలు కురిశాయని ఐఎండీ తెలిపింది. హన్మకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో అతి భారీవర్షాలు కురిశాయని తెలిపారు. హన్మకొండ జిల్లాలో 50 శాతం ప్రాంతాల్లో అతి భారీవర్షం కురిసింది. వరంగల్ జిల్లాల్లో 42.9 శాతం, జనగామ జిల్లాలో 40 శాతం అతి భారీ వర్షాలు కురిశాయని వివరించారు.

**44 మండలాల్లో అతి భారీవర్షాలు**

తెలంగాణలోని 14 మండలాల్లో అతి భారీవర్షాలు కురిశాయని హైదరాబాద్ వాతావరణశాఖ గురువారం విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. 14 ప్రాంతాల్లో 204.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరో 30 మండలాల్లో 115.6 నుంచి 204.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో 46 మండలాల్లో 64.5 నుంచి 115.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 123 మండలాల్లో 15.6 నుంచి 64.4 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డు అయింది. 81 స్టేషన్లలో 01 నుంచి 15.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఎ ధర్మరాజు చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా 368 ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి.

**వర్షపాతం రికార్డులివి...**

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో అత్యధికంగా 422.0 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని ఐఎండీ అధికారులు చెప్పారు. కరవు పీడిత మండలంగా పేరొందిన భీమదేవరపల్లిలో కరవు తీరా వర్షాలు కురిశాయి. వంగర చెరువు గండి పడే ముప్పు ఏర్పడటంతో పోలీసులు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించి నీటిని దిగువకు వదలడంతో ప్రమాదం తప్పింది. పర్వతగిరి మండలం కల్లెడలో 415.5 మిల్లీమీటర్లు, నెక్కొండ మండలం రెడ్లవాడలో 358.5 మిల్లీమీటర్లు, ఖిలా వరంగల్ ఉర్సులో 347.3 మిల్లీమీటర్లు, ధర్మసాగర్ లో 332.8 మిల్లీమీటర్లు, సంగెం మండలం కాపులకనపర్తిలో 332.8 మిల్లీమీటర్లు, వర్ధన్నపేట మండలం వర్ధన్నపేటలో 324.0 మిల్లీమీటర్లు, సంగెంలో 310.5మిల్లీమీటర్లు,సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లో 304.3 మిల్లీమీటర్లు, జనగామలో 294.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఐఎండీ అధికారులు వెల్లడించారు. అతి భారీవర్షాల వల్ల వరదలు వెల్లువెత్తాయి. పలు జనవాసాలు, కాలనీలను వరద నీరు ముంచెత్తింది.

**జిల్లాల్లో వెల్లువెత్తిన వరదలు**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తుండటంతో వరదలు వెల్లువెత్తాయి. భారీవర్షాలు...వరదలతో పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. దీంతో హన్మకొండ, ఖమ్మం, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో గురువారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



నీటిలో తేలియాడుతున్న మూడు ప్రాంతాలు

వరంగల్, హన్మకొండ, కాజీపేట ప్రాంతాలు వరదనీటిలో తేలియాడుతున్నాయి. సోమిడి చెరువు, వడ్డెపల్లి చెరువు, ఊర చెరువు నిండిపోయాయి. ఊరచెరువుకు పడిన గండితో వరంద నీరు మూడు ప్రాంతాలను ముంచెత్తింది. 118 కాలనీలు నీట మునగటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రగతినగర్, హంటర్ రోడ్డు నీట మునిగాయి. హైదరాబాద్ వరంగల్ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచాయి. స్టేషన్ ఘన్ పూర్ ప్రాంతంలోనూ వరద నీరు పొంగి ప్రవహిస్తుంది. మొంథా తుపాన్ వల్ల భారీ వర్షం వరంగల్ జిల్లాల్లో కురవడంతో వరదలు వెల్లువెత్తాయి. భారీవర్షాలతో డిండి ప్రాజెక్టులోకి వరదనీరు పెద్ద ఎత్తున చేరింది. శ్రీశైలం హైదరాబాద్ మార్గంలో వరదనీటి ధాటికి తెగిపోయింది. ఈ రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

**వరదనీటిలో కొట్టుకుపోయిన వ్యాన్**

మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు కొణిజర్ల మండలంలో పడిగేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. ఈ వాగులో వ్యాన్ కొట్టుకుపోయింది. తుమ్మలపల్లి గ్రామం రహదారిపై ఉధృతితో ప్రవహిస్తున్న వరద ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. ఖమ్మం జిల్లాకలెక్టర్ అనుదీప్ దురిశెట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సంసిద్ధతతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సహాయానికి ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్లు టోల్ ఫ్రీ నెంబర్1077, వాట్సాప్ సెల్ నెంబర్ 9063211298 లను ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు.

**ఇల్లు వదిలి బయటకు రావద్దు**

మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో హన్మకొండ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇల్లు వదిలి బయటకు రావద్దని కోరారు. ట్రాన్స్ ఫార్మర్లు,విద్యుత్ స్తంభాలు,విద్యుత్ వైర్ల చెంతకు వెళ్లవద్దని సూచించారు. వర్షాలకు సంబంధించి టోల్ ఫ్రీ నంబరు 18004251442 కు సంప్రదించవచ్చునన్నారు. కాజీపేట్‌లోని శ్రీ వెంకటేశ్వర హోం నుంచి 152 మంది పిల్లలను వరద ప్రవాహం కారణంగా మడికొండ సోషియల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్ స్టిట్యూషన్‌కు తరలించామని కలెక్టర్ చెప్పారు. మొంథా తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

**కొండపర్తి వద్ద కాలువ గండిని నివారించిన అధికారులు**

హనుమకొండ జిల్లా యంత్రాంగం త్వరిత చర్యలు తీసుకొని ఐనవోలు మండలం కొండపర్తి వద్ద కాలువ తెగిపోవడాన్ని సమర్థవంతంగా ఆపారు. ధర్మసాగర్‌లోని ముప్పారం ట్యాంక్ నుండి భారీ వరదను విజయవంతంగా మళ్లించారు.

**కరీంనగర్ జిల్లాలో...**

కరీంనగర్ జిల్లాలో గురువారం పాఠశాలలను మూసివేశారు. రాబోయే రెండు రోజుల్లో మొంథా తుపాను ప్రభావం వల్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముందుజాగ్రత్త చర్యగా అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. సైదాపూర్ మండలంలో వాగులు వరదనీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. అత్యవసరమైతే తప్ప పౌరులు ఇంటి లోపలే ఉండాలని, కల్వర్టులను దాటకుండా లేదా నీటి వనరులలోకి ప్రవేశించకుండా ఉండాలని కోరారు.

**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో...**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల దృష్ట్యా గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. వాగులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలపై నిరంతర నిఘా పెట్టామని చెప్పారు. ప్రమాద ప్రాంతాల్లో సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని, వాగులు-వంతెనలు దాటవద్దని కోరారు. వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉంది అని కలెక్టర్ పేర్కొన్నారు.

### రోడ్లను ముంచెత్తిన వరదనీరు

రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని అధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు.ఖమ్మంరూరల్ మండలంలోని జలగంనగర్, కేబీఆర్ నగర్, గ్రీన్ కాకతీయనగర్ తదితర మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించారు. మొంథా తుపాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలకు మున్నేరు వరద ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు అనవసరంగా ముంపు ప్రాంతాల్లో తిరగవద్దని ఆయన సూచించారు. ఎగువ నుండి వచ్చే వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున #ఖమ్మం జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సంసిద్ధతతో స్థానికంగా ఉంటూ మరింత అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు నీటిమట్టం అంచనా వేస్తూ జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు, మున్నేరు ఘాట్, గణేష్ నిమర్జన ఘాట్, బొక్కలగడ్డ తదితర ప్రాంతాలలో మున్సిపల్ కమీషన్ అభిషేక్ ఆగస్త్య తో కలిసి పర్యటించారు. ప్రస్తుతం ఖమ్మం వద్ద మున్నేరు17అడుగుల మేర ప్రవహిస్తోందని మరో రెండు అడుగులు పెరిగే అవకాశం ఉందన్నారు.



# వరదలో వరంగల్.. కన్నీటి ఖమ్మం

### ఓరుగల్లును ఆగంచేసిన తుఫాన్.. వరంగల్ సిటీలో నీటమునిగిన వంద కాలనీలు
### ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు ఉగ్రరూపం.. వరద పరిస్థితులపై సీఎం రేవంత్ సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

వరంగల్‌హనుమకొండను అనుసంధానం చేసే హంటర్ రోడ్డులో బొంది వాగు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రభావంతో వరంగల్ భద్రకాళి ఆలయానికి రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలు, వాగులు వంకు పొంగిపొర్లడంతో వరంగల్‌హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరింది. కార్లు మునిగేంత నీరు వచ్చి చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హంటర్ రోడ్డులో బొంది వాగు తీవ్ర ఉధృతితో ప్రవహిస్తోంది. మానుకోట, వరంగల్, హనుమకొండలోని లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉండిపోయాయి.హనుమకొండములుగు రహదారి లోలెవ్ బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు వెళ్ళాయి. ముగ్దుంపురం చెరువు అలుగు పోస్తుండడంతో.. నర్సంపేటచెన్నారావుపేట రహదారిపై లోలెవల్ కాజ్‌వేపై వరద ప్రవహిస్తోంది. దీంతో నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తుండగా.. 45 కాలనీలు నీట మునిగాయి. ఏడు ప్రత్యేక బృందాలు సహాయక చర్యల కోసం రంగంలోకి దిగాయి. ముంపు ప్రాంతాల ప్రజలను ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వేల ఎకరాల్లో పంట నీటి పాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరంగల్‌లో 9, హనుమకొండలో 3 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు వరద ప్రభావంతో భద్రకాళి ఆలయం నుంచి పాలిటెక్నిక్ కాలేజీ దాకా రోడ్డుపై నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో ఆలయం వైపు మార్గాన్ని మూసేశారు.

**ఓరుగల్లును ఆగంచేసిన తుఫాన్**

ఉమ్మడి వరంగల్‌లో మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షం కురిసింది. హనుమకొండ భీమదేవరపల్లిలో 42.2 సెం.మీ వర్షం, వరంగల్ జిల్లా పర్వతగిరిలో 41.5 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. అలాగే హన్మకొండ జిల్లా ధర్మసాగర్‌లో 33.8 సెం.మీ వర్షం, వరంగల్ జిల్లా సంగెంలో 33.8 సెం.మీ, నెక్కొండలో 35 సెం.మీ వర్షం,ఖిలా వరంగల్‌లో 34.3 సెం.మీ వర్షపాతం కురిసింది. వర్ధన్నపేట్ లో 32.8 వర్షపాతం నమోదుకగా, జనగామ జిల్లా పాలకుర్తిలో 29.4 సెం.మీ, మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 25.8 సెం.మీ వర్షం కురిసింది.

**కన్నీరు మిగిల్చిన తుఫాన్..!**

మొంథా తుపాన్ రైతుల ఆశల ఊపిరితీసింది. ఇంతకాలం ఆశతో సాగుచేసిన పత్తి, వరి పంటలు ఒక్క రాత్రిలో నేలపాలు అయ్యాయి. పత్తితీతలు సాగుతున్న వేళ కురిసిన అకాల వర్షం రైతుల ఏడాది కష్టాన్ని తుడిచిపెట్టేసింది. 2.51 లక్షల ఎకరాల్లో పత్తి, 2.98 లక్షల ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. కంకి దశలో ఉన్న వరి మునిగి కుళ్లిపోగా, కోత దశలో ఉన్న పత్తి తేమతో నిండిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వర్షపు నీటిలా వదిలి పోయింది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా రైతుల పంటను తక్కువ ధరలకు కొంటున్నారు. సీసీఐ కేంద్రాల్లో తేమ పేరుతో తిరస్కరణలు, ఆన్‌లైన్ విధానం పేరుతో సాంకేతిక అవరోధాలు ఇవన్నీ రైతుల మోస్తున్న భారాన్ని రెట్టింపు చేస్తున్నాయి* ఖమ్మం జిల్లాలో తుపాన్ రాకతో రైతుల భవిష్యత్తు చీకట్లో మునిగిపోయింది. వానకాలం ప్రారంభం నుంచి వర్షాలు విరామం లేకుండా కురుస్తుండటంతో పంట దిగుబడులు తగ్గిపోయాయి. ఇప్పుడు తుపాన్ తాకిడితో పత్తి పంటపై తేమ శాతం అధికమై మార్కెట్‌లో ధరలు కుప్పకూలిపోయాయి. కేంద్రం పత్తి క్వింటాకు రూ.8,110 మద్దతు ధర నిర్ణయించినా, మార్కెట్‌లో వ్యాపారులు రూ.7వేలకు మించి ఇవ్వడం లేదు. ఖమ్మం మార్కెట్‌లో మంగళవారం మోడల్ ధర రూ.6,500కు పడిపోవడంతో రైతులు క్వింటాకు రూ.1,600 నష్టం చూస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరుతో రైతుల పంటలను తిరస్కరిస్తుండటం మరొక దెబ్బగా మారింది. రైతులు పంటను మళ్లీ ఇంటికి తీసుకెళ్లి ఆరబెట్టడం, తిరిగి తేవడం – ఈ కష్టాలన్నీ భరించలేక చాలా మంది ప్రైవేట్ వ్యాపారులకే తక్కువ ధరకే అమ్మకానికి ఒప్పుకుంటున్నారు. ఈ ఏడాది సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని అమ్మాలంటే రైతులు ముందుగా మొబైల్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేయాలి. కానీ గ్రామీణ రైతులకది పెద్ద తలనొప్పిగా మారింది. క్రాప్ బుకింగ్ చేయని రైతులు యాప్‌లో కనిపించకపోవడం వల్ల సీసీఐ కేంద్రాల్లో విక్రయించే అవకాశం కోల్పోతున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సీసీఐ కేంద్రాలు తెరిచినప్పటికీ కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు కేవలం 128 టన్నుల పత్తి మాత్రమే కొనుగోలు జరగగా, భద్రాద్రి జిల్లాలో కొనుగోలు ప్రారంభమవ్వలేదు.

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ గ్రామాల్లో తేమ పరీక్ష యంత్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినా, అవి వాస్తవానికి అందుబాటులో లేవు. రైతులు పంటను సీసీఐ కేంద్రాలకు నేరుగా తీసుకెళ్లి అక్కడే తేమ అధికమైందని చెప్పడంతో వెనుదిరగాల్సి వస్తోంది. ఈ తిప్పలన్నీ భరించలేక రైతులు ప్రైవేట్ కొనుగోలు దారుల చేతికి తాము పెంచిన పంటను అప్పగిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యం ఒకవైపు, ప్రభుత్వ విధానాలు మరోవైపు - రెండూ రైతుని గోడ దిశగా నెట్టేస్తున్నాయి. వర్షాలు, తేమ, మార్కెట్ దోపిడి, ఆన్‌లైన్ ఇబ్బందులు - ప్రతి అడుగులోనూ రైతు మట్టికరిపోతున్నాడు. రైతు వేదికల వద్ద తేమ యంత్రాలు, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయకపోతే ఈ పరిస్థితి మరింత విషమమవుతుంది.

### ఖమ్మం జిల్లాలో మున్నేరు ఉగ్రరూపం

ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చి పరివాహక ప్రాంతాలను నీటమునిగేలా చేసింది. వాగు ప్రవాహం పెరగడంతో తక్కువ ప్రాంతాల్లోని గ్రామాలు వరద బీభత్సాన్ని ఎదుర్కొంటున్నాయి. పంటలు మునిగిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. అధికారులు అప్రమత్తమై, నీరు ఎక్కువగా చేరిన గ్రామాల్లో ప్రజలను తరలిస్తున్నారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక బృందాలు వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సహాయక చర్యలు చేపట్టాయి. మొత్తం మీద, తెలంగాణలోని వర్షాలు ప్రజల జీవితాలను స్తంభింపజేశాయి. నిపుణులు ఇంకా రెండు రోజులపాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు – ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ సూచనలను పాటించాలని సూచించారు.

# మోకాలు లోతు బురదలో దిగి..
## నేలకొరిగిన పంట పరిశీలించిన పవన్

**కృష్ణా, మహా:** మోకాలు లోతు బురదలో దిగారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. అన్నదాత కష్టాన్ని విని ఓదార్చారు. తుపాను కారణంగా జరిగిన పంట నష్టాన్ని పంట పొలాల మధ్యకు వెళ్లి పరిశీలించారు. అరటి రైతుల ఆవేదన విన్నారు. మీ కష్టంలో మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. గురువారం కృష్ణా జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన పవన్ నేరుగా కోడూరు మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో నేలకొరిగిన వరి చేల వద్దకు వెళ్లారు. రైతులతో కలసి బురద చేలోకి దిగి పడిపోయిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొట్ట దశలో ఉన్న వరి కంకులను పరిశీలించారు. అన్ని విధాలా ఆదుకుంటామంటూ కూటమి ప్రభుత్వం తరఫున భరోసా ఇచ్చారు.

**పొట్ట దశలో పుట్టి ముంచింది..**

కృష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీ కోట రమేష్ అనే రైతుకి చెందిన అయిదు ఎకరాల వరి పంట పూర్తిగా నేలకొరిగింది. పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా ఆ రైతు తనకు వచ్చిన కష్టాన్ని ఆయనకు వివరించారు. ఇప్పుడిప్పుడే వరి పొట్ట పాలు పోసుకుంటున్న దశలో తుపాను రావడం వల్ల పంట పూర్తిగా నాశనం అయిందని, ఎందుకూ పనికి రాకుండా పోయిందని పవన్ కళ్యాణ్ ఎదుట వాపోయారు. మరో రెండు వారాలు ఆగితే పంట కోత దశకు వచ్చేదని తెలిపారు. వెంకటేశ్వరరావు అనే రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు. నీటిలో తడిసిన ధాన్యపు గింజలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కు త్వరితగతిన పంట నష్టం నివేదికలు ఇవ్వాలని సూచించారు. నష్టపోయిన వారిలో కౌలు రైతులు కూడా ఉన్నారని, వారిని ఆదుకోవాలని పలువురు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. తుపాను కారణంగా నష్టపోయిన కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అవనిగడ్డ మండల పరిధిలోని రామచంద్రపురం సమీపంలో తుపాను ధాటికి దెబ్బతిన్న అరటి తోటను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. విష్ణుమూర్తి అనే రైతుకి చెందిన అరటి తోట మొంథా తుపాను సమయంలో వీచిన పెనుగాలులకు పూర్తిగా నేల మట్టం అయినట్లు తెలుసుకున్నారు. సుమారు 1400 అరటి గెలలు పనికిరాకుండా పోయాయని రైతు పవన్ కు వివరించారు. ఉద్యాన శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసే సమయంలో రైతులకి మేలు చేసేలా ఆలోచన చేయాలని సూచించారు.





### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేత

#### ఎమ్మెల్యే బేబీ నాయన

**విజయనగరం జిల్లా,మహా:** బొబ్బిలి నియోజకవర్గంలో కొందరు పౌరుల ఆరోగ్యసమస్యలు,ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా,ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసి,సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బేబీ నాయన,మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్ బాబు గురువారం నాడు బొబ్బిలి కోటలో లబ్ధిదారులకు అందజేశారు. బొబ్బిలి పట్టణం,దిబ్బ వీధికి చెందిన నిమ్మాడి లత,రూ 30,786/ బొబ్బిలి పట్టణం,గొల్లపల్లికి చెందిన సోంబర్కి మనోహర్ రూ 30,000/ రామభద్రపురం గ్రామానికి చెందిన తిళ్ళపూడి రాజు,రూ 30,900/ బొబ్బిలి పట్టణం, కోరాడ వీధికి చెందిన మండల రమణమ్మ రూ30,042/బొబ్బిలి పట్టణం, తారకరామ కాలనీకి చెందిన మడక ప్రసన్నకుమార్, రూ 25,341/బొబ్బిలి మండలం,రేజేరు గ్రామానికి చెందిన బొమ్మినాయుని సుధారాణి,రూ 23,400/ తెర్లాం మండలం,నందబలగ గ్రామానికి చెందిన బేత పారినాయుడు రూ27,810/ లొల్లరపాడు గ్రామానికి చెందిన తింగలి నీరజ్,రూ19,850/ బొబ్బిలి పట్టణం,గొల్లపల్లికి చెందిన కాకాల గ్రీష్మ హాసిని,రూ 39,500/లబ్ధిదారులకు అందజేశారు.

# హరీశ్ రావుకు కవిత పరామర్శ

### మాజీ మంత్రి తండ్రి మృతి పట్ల కుటుంబానికి సంతాపం

#### కాళేశ్వరం ఇష్యూపై విమర్శలు, సస్పెండ్ తర్వాత తొలిసారి భేటీ



**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి హరీశ్ రావును పరామర్శించారు. హరీశ్ రావు తండ్రి సత్యనారాయణరావు రెండు రోజుల క్రితం మరణించిన సంగతి తెలిసిందే. ఈరోజు హరీశ్ ఇంటికి వెళ్లిన కవిత, ఆయన కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యనారాయణరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేసి, కాసేపు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అయితే, ఈ పరామర్శకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. సత్యనారాయణరావు అంత్యక్రియలకు కవిత హాజరుకాలేదు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంలో కవిత... హరీశ్ పై తీవ్రమైన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై హరీశ్ నేరుగా స్పందించకపోయినా, తన ప్రస్థానం తెరిచిన పుస్తకం అంటూ పరోక్షంగా సమాధానమిచ్చారు. ఆ వివాదం తర్వాత హరీశ్ ఇంటికి కవిత వెళ్లడం ఇదే మొదటిసారి.



### సఖి సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన

#### మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్ బాబు..

**విజయనగరం జిల్లా.మహా:** బొబ్బిలి పట్టణం ఉన్న శ్రీ కళాభారతి ఆడిటోరియంలో గురువారం నాడు మెప్మా ఆధ్వర్యంలో సఖి సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు.వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్ బాబు ప్రారంభించారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో 1000 మంది మహిళలకు వైద్య సేవలు అందించారు. మహిళలకు రక్త నమోనాలు సేకరించి ల్యాబ్'కు పంపించామని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్ బాబు మాట్లాడు తూ.. మహిళలు ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్ రామలక్ష్మి, పాల్గొన్నారు.



# ఇది కదా.. లక్కంటే

## ఎందరో నేతలు.. అందులో రికార్డు వీరులు వీరే...

### ఎమ్మెల్యే..ఎమ్మెల్సీ కాకుండానే మినిస్టర్.. తెలంగాణలో అజారుద్దీన్ రికార్డు

**మహా:** కొందరు నేతలకు అంతే.. అదృష్టం బంకలా పట్టుకుంటుంది. ఒకసారి గ్రహాలు.. నేత వైపు చూస్తే.. లక్కు చిక్కితే రాత్రికి రాత్రే లెక్కలు మారిపోతాయి. కొందరు నేతలు ఏ చట్టసభల్లో చోటు లేకుండానే ఏకంగా మినిస్టర్లు, సీఎంలు అయిపోయారు. అలాంటి జాబితాలోకి ఇపుడు అజ్జూ భాయ్ చేరాడు. మాజీ టీమిండియా క్రికెటర్ అజారుద్దీన్ గ్రీస్‌లో లేకుండానే సిక్స్ కొట్టారు. మీరు ఎప్పుడైనా టీవీలో డైరీ మిల్క్ యాడ్ చూశారా? అందులో సమయానికి ఏం చేయకపోయినా మంచిదే అని ఓ ముసలావిడ కుర్రాడితో చెప్పారు. అలాగే ఉంది అజారుద్దీన్ అదృష్టం.. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఆయనకు బాగా కలిసొచ్చింది. పోటీ చేయకుండా సీటు త్యాగం చేసి మంత్రి అయ్యారు. అసలు టికెట్ కోసం ఆయన ఎక్కని గడపా లేదు.. దిగని గడపా లేదు. నేతలందరి ఇళ్ళ చుట్టూ తిరిగి అలిసిపోయారు. టికెట్ లెక్కలు తెలిసి సైలెంట్ అయిపోయారు. ఎమ్మెల్సీ ప్రకటించగానే ఆశ్చర్యపోయారు. దానికి ఆమోదానికి జాప్యం జరగడంతో నిరాశ పడ్డారు. కానీ లక్కు అజర్ పక్కనుండడంతో ఇపుడు ఏకంగా మంత్రవుతున్నారు. తెలంగాణ రాష్ట్రమంత్రిగా అజర్ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. మణికట్టు మాయాజాలతో భారత క్రికెట్ జట్టును అంతర్జాతీయ క్రికెట్ లో అద్భుత శిఖరాలకు తీసుకెళ్ళిన అజర్.. ఇపుడు ప్నభుత్వంలో భాగస్వామిగా ఎలా రాణిస్తాడోనన్న ఉత్కంఠ నెలకొంది. తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ అజారుద్దీన్ చోటు దక్కింది. అక్టోబర్ 31న ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. కానీ అజారుద్దీన్ ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా లేరు. అయినా సరే ఆయన మంత్రి పదవి చేపట్టవచ్చు. కెబినెట్‌లోకి తీసుకున్నాక.. ఆరు నెలల్లోగా ఆయన శాసన మండలి లేదా శాసన సభ ఏదో ఒక చట్టసభలో సభ్యుడిగా ఉండాలి. దీంతో అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో అన్నీ జిల్లాలకు ప్రతినిధ్యం వహిస్తూ మంత్రులు ఉన్నారు ఒక్క హైదరాబాద్‌కు తప్ప. హైదరాబాద్ జిల్లా, మైనార్టీ విభాగాల వారీగా చూస్తే మంత్రి పదవికి అర్హుడు ఆయనొక్కడే ఉన్నారు. అలా ఆయన ఎమ్మెల్యేగా గెలవకున్నా మంత్రి పదవి వరించింది. ఇటీవల గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అజారుద్దీన్ పేరును ప్రభుత్వం సూచించింది.

## వీరిదే రికార్డు

ఎమ్మెల్యే.. ఎమ్మెల్సీ కాకుండానే మంత్రి పదవి చేపట్టిన నేతల జాబితాలో అజారుద్దీన్ చేరారు. ఇందులో ప్రధానంగా సీఎంగా పనిచేసిన అంజయ్యది రికార్డు. ఆయన అక్టోబర్ 11, 1980న ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ లేకుండానే ఉమ్మడి ఏపీ సీఎంగా నియమించారు. రాజ్యాంగ నిబంధనలను నెరవేర్చడానికి ఆయన తరువాత శాసనసభకు ఎన్నికయ్యారు ఆ తర్వాత తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్యే హరీశ్ రావు కూడా ఎమ్మెల్యే కాకపోయినా వైఎస్ క్యాబినెట్ లో యువజన సర్వీసుల శాఖ మంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత ఆయన సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఏపీలో నారా లోకేష్ ఏప్రిల్ 2017లో తన తండ్రి ఎన్. చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.ఆ తర్వాత మార్చి 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఇప్పడు అజారుద్దీన్ కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాకుండానే రేవంత్ క్యాబినెట్ లో మంత్రి అవుతున్నారు. వెస్ట్ బెంగాల్‌లో మమతా బెనర్జీ కూడా ఎమ్మెల్యేగా గెలవకుండానే ముఖ్యమంత్రి అయ్యారు. బీహార్ లో నితీష్ కూడా పోటీచేయకుండానే సీఎం అవుతుంటారు. తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ కాకుండానే మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రికార్డును అజారుద్దీన్ కైవసం చేసుకున్నారు.





# 24/7 అధికారులు సహాయక చర్యలో పాల్గొనాలి

## వరద ప్రభావ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా;** తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షం కారణంగా హనుమకొండ నగరంలో వరద ఉధృతి పెరగడంతో నగరంలోని పలు కాలనీలు పూర్తిగా జలమయ మైయ్యాయి. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలను గురించి విధుల్లో ఉన్న అధికారులతో ఆయా కాలనీలు లోతట్టు ప్రాంతాల పరిస్థితులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద తీవ్రత అధికంగా ఉన్న కాలనీల్లో తాజా స్థితిగతులను అడిగి తెలుసుకుని రెవెన్యూ, పోలీస్, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ డిఆర్ఎఫ్ బృందాలు అందిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. గోపాలపూర్ ఊరు చెరువు తో పాటు ప్రగతి నగర్, వివేక్ నగర్, అమరావతి నగర్, 100 ఫీట్ల రోడ్డు, సమ్మయ్య నగర్ ప్రాంతాలను కలెక్టర్ సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఆయా ప్రాంతాలలోని కాలనీలు వరద నీటిలో చిక్కుకోగా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించి తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. అక్కడనుండి హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక కుటుంబం వరదలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమాచారం రావడంతో కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆ ప్రాంతానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని సహాయక చర్యల్లో పాల్గొంటున్న డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో బోటులో బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రానికి కుటుంబాన్ని తరలించారు. సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలో వరద ముంపు తీవ్రంగా ఉండడంతో అక్కడ ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలకు చెందిన 470 మంది విద్యార్థినులను సురక్షితంగా బయటకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించగా డిఆర్ఎఫ్ సిబ్బంది లైఫ్ బోట్ల ద్వారా హాస్టల్ నుండి బయటకు తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో హసన్పర్తి లోని డిగ్రీ కళాశాలకు, సుబ్బయ్య పల్లి లోని కళాశాలకు, మడికొండలోని బాలికల కళాశాలలకు తరలించారు. విద్యార్థినులను అధికారులు, సహాయక బృందాలు సురక్షితంగా తరలిస్తుండగా కలెక్టర్ అక్కడే ఉండి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. హనుమకొండలోని అలంకార్ జంక్షన్ తో పాటు కాపు వాడలో వరద ముంపు గురైన కాలనీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరద ముంపు గురైన కాలనీలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ సహాయక చర్యలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. వరద నీటి వల్ల ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు వరద ప్రభావ పరిస్థితుల పై 24/7 పర్యవేక్షణ చేయాలన్నారు. హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావు సింగ్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న, సుబేదార్ ఇన్స్పెక్టర్ రంజిత్ కుమార్, సూపరింటెండెంట్ జగత్ సింగ్, కిరణ్ కుమార్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ శ్యాం కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు పోలీసులు అండగా నిలవాలి

## కాలనీలు, ముంపు ప్రాంతాలను పరిశీలించిన సీపీ, కలెక్టర్



**వరంగల్ హన్మకొండ మహా;** వరంగల్, హనుమకొండ నగరాల్లో తుఫాన్ కారణంగా బుధవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నీట మునిగిన ప్రాంతాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తో కలిసి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. ఈ సందర్భంగా హనుమకొండ లోని లోతట్టు ప్రాంతాలు పలు కాలనీలలో గృహ నిర్బంధమైన ప్రజల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉండాలన్నారు. అలాగే తీవ్ర వరద ఉధృతితో పూర్తి జలదిగ్బంధంలో చిక్కుకున్న హంటర్ రోడ్ లోని బృందావన కాలనీ, సాయి నగర్, ఎన్టీఆర్ నగర్ కాలనీల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహిస్తున్న సహాయక చర్యలను స్థానిక కార్పొరేటర్ గందె కల్పన నవీన్ తో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వరద ఉధృతి పూర్తిగా తగ్గేదాకా ప్రజలను అప్రమత్తం చేస్తూ వరద బాధితులకు 24/7 పోలీసులు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలవాలని, అంతేకాకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. సిపి వెంట డిసిపి అంకిత్ కుమార్, వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పి శుభం ప్రకాష్, మట్టేవాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



## వరద బాధితులకు అండగా నిలిచిన బిజెపి సీనియర్ నేత

**వరంగల్ మహా;** వరంగల్ నగరం 28వ డివిజన్ హంటర్ రోడ్డు పరిధిలోని ముంపు ప్రాంతాల్లో బిజెపి జిల్లా సీనియర్ నేత గందె నవీన్ కుమార్ స్థానిక నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. గురువారం తన జన్మదిన వేడుకలను కూడా పక్కన పెట్టి సర్వం కోల్పోయి ఆపదలో ఉన్న తన డివిజన్ ప్రజల క్షేమం కోసం భోజనాలు, మంచినీరు, బట్టలను స్వయంగా అందజేశారు. పూర్తిగా వరదనీటిలో చిక్కుకొని ఉన్న వారిని సహాయక బృందాలు, పోలీసుల సహాయంతో బోట్ల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద నీరు ఉధృతి పూర్తిగా తగ్గేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు.

# పీజీ కళాశాలలో ప్రవేశాలకు నవంబర్ 1 చివరి అవకాశం



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లీష్,ఎంఏ పొలిటికల్ సైన్స్,ఎంకాం కోర్సులలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ నవంబర్ 1వ తేదీలోపు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్,ఎంఏ ఇంగ్లీష్, ఎంకాం కోర్సుల లో సీట్లు ఉన్నాయని తెలిపారు. 202526 విద్యాసం. లో పీజీలో ప్రవేశానికి గాను టీజీ సిపి గెట్ 2025 రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఉత్తీర్ణులు కాని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు...నవంబర్ 2, 3, 4,మ తేదీల్లో వెబ్ ఆప్షన్స్...నవంబర్ నెల 2, 3, 4 తేదీల వరకు బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో సీటు కోసం మొదటి ప్రాధాన్యతగా ఆప్షన్ పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. తద్వారా బెల్లంపల్లి పీజీ కళాశాలలో సీటు పొందే అవకాశం ఉంటుందన్నారు... విజయవంతంగా ప్రవేశాలు, ఫలితాలు.. గత విద్యా సంవత్సరం ప్రారంభమైన పిజి సెంటర్ విజయవంతంగా కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి ఏడాదిలోని అడ్మిషన్లు ఎంత స్థాయిలో అయ్యాయో సెమిస్టర్ల పరీక్షా ఫలితాలు కూడా అంతే గొప్పగా వచ్చాయని పేర్కొన్నారు. బెల్లంపల్లిలో స్థానికంగా లభిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## వరద ఉధృతికి బైక్‌తో సహా కొట్టుకుపోయిన యువతీ యువకుడు

### బయటపడ్డ యువకుడు, గల్లంతైన యువతి

**జనగామ మహా;** జనగామ జిల్లా తిమ్మంపేట మండలం లోని బోళ్లమత్తిడి వద్ద స్టేషన్ ఘనపూర్-జాఫర్ ఘడ్ రహదారి పై వరద ప్రవాహానికి బైక్‌తో సహా కొట్టుకుపోయిన శివకుమార్, శ్రావ్య అనే యువతీ యువకుడు కొట్టుకుపోయారు. ఆ వరద ప్రవాహంలో ఓ చెట్టు కొమ్మను పట్టుకుని శివకుమార్ బయటపడగా సదరు యువతి శ్రావ్య వరదలో గల్లంతైయ్యాంది. ఆ యువతి కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.



## ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

### తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన సిపిఎం నాయకులు

**వలిగొండ, మహా ;** ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ ప్రారంభించిన నేటికీ అనేక ఐకెపి సింగల్ విండో కేంద్రాల్లో కొనుగోలు జరగకపోవడంతో మార్కెట్లో నిల్వ ఉన్న ధాన్యం ఇటీవల కురుస్తున్న వర్షాలకు పూర్తిగా తడిసి మొలకలు వస్తున్నాయని వెంటనే ధాన్యం కొనుగోలను వేగాంతం చేసి మొలకెత్తిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మద్దెల రాజయ్య సిర్పంగి స్వామి మెరుగు వెంకటేశం కావిడే సురేష్ వేముల చంద్రయ్య కొమ్మిడి సత్తిరెడ్డి నారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ @ 150 యూనిటీ మార్చ్



**యాదాద్రి భువనగిరి, మహా :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ని పురస్కరించుకొని ప్రజలలో జాతీయ సమైక్యతను దేశభక్తిని పెంపొందించేందుకుగాను, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ మరియు ఎన్ఎస్ఎస్ సహకారంతో "సర్దార్@ 150 యూనిట్ మార్చ్" ను నిర్వహించనున్నట్లు ఎంపీ, రాజ్యసభ సభ్యులు భగవత్ కరద్ తెలిపారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హల్ నుండి సర్దార్ @ 150 యూనిటీ మార్చ్ కార్యక్రం అమలులో భాగంగా జిల్లాల అధికారులు, మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫెరెన్స్ లో మాట్లాడారు. సర్దార్ @ 150 యూనిటీ మార్చ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సమైక్యత,దేశభక్తి ని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర , జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 31 నుండి నవంబర్ 25 వరకు జిల్లాలలో విడతలవారీగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, సర్దార్ @ 150 యూనిటీ మార్చ్ లో 3 రోజుల పాదయాత్రను జిల్లాస్థాయిలో నిర్వహించాలని, ప్రతి పాదయాత్ర 8 నుండి 10 కిలోమీటర్లు ఉండేలా చూడాలని, ఈ పాదయాత్రలో కనీసం 500 మంది యువత, విద్యార్థులు పాల్గొనేలా చూడాలని ఆయన అధికారులతో కోరారు. సర్దార్ @ 150 యూనిటీ మార్చ్ నిర్వహించడంలో వల్లభాయ్ పటేల్ భాగంగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అధికారులతో కోర్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని , అధికారులు, జిల్లా యువజన సర్వీస్అధికారి, ఇతర అధికారులు, ప్రతినిధులతో కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా గా స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లడుతూ సర్దార్@ 150 యూనిటీ మార్చ్ కార్యక్రమాల లో భాగంగా జిల్లా స్థాయిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితానికి సంబంధించి ప్రజలకు యువతకు తెలియజేయడం, కళాశాల,పాఠశాల విద్యార్థులకు డిబేట్, వ్యాసరచన చేపట్టాడం జరుగుతుందని ఆయన తెలిపారు. నవంబర్ 26 జాతీయ స్థాయ మహా ఐక్యతా పాదయాత్ర నిర్వహిస్తారని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జన్మస్థలమైన కరంసద్ (గుజరాత్) నుంచి ప్రారంభమై 152 కి.మీ. సాగి Statue of Unity వద్ద ముగియనుంనది. ఇవే 5 5 5 My Bharatportal (https://mybharat.gov.in/) రచనా పోటీలు క్విజ్ పోటీలు,మొదలగు పోటీలు నిర్వహిస్తారు. యువతి యువకులు ఆన్ లైన్ లో పోటీలలోకి పాల్గొనాలని తెలియజేశారు. జిల్లాల వారీగా రూట్ మ్యాప్ ను రూపొందించాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నవంబర్ 10వ తేదీలలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన జిల్లా యంత్రాంగాన్ని కోరారు. స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎంపీ, రాజ్యసభ సభ్యులు శ్రీ భగవత్ కరద్,కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో వచ్చే నెల 10 వ తేదిన సర్దార్ 150 యూనిట్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా యూత్ ఆఫీసర్ గంటా రాజేష్, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనంజ నేయులు, ఇంటర్మీడియట్ విద్యాధికారి రమణి, జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలన సింగరేణి సంస్థ లక్ష్యం

### అవినీతి నిర్మూలన సింగరేణి సంస్థ లక్ష్యం



**మందమర్రి, మహా :** అవినీతి నిర్మూలన సింగరేణి కాలరీస్ కంపెనీ (సంస్థ) లక్ష్యమని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ అన్నారు. గురువారం స్థానిక జీవీటీసీ సమావేశ మందిరంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు ఆయనతో పాటు మందమర్రి ఎం.వి.టి.సి. మేనేజర్ శంకర్, బెల్లంపల్లి జీఎం విజయ భాస్కర్ రెడ్డి, శ్రీ రాంపూర్ ఏజీఎం కె.రాజేందర్, కిషోర్ బగాడియో (గెస్ట్ లెక్చరర్ ఆన్ విజిలెన్స్ అవేర్నెస్ వీక్), హైదరాబాద్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.ఎం మాట్లాడుతూ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థలతో పాటు సింగరేణి సంస్థలో కూడా అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశానుసారం 1987 వ సంవత్సరంలో సింగరేణి కంపెనీ లో నిఘా విభాగం (విజిలెన్స్ విభాగం) ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ విభాగం చీఫ్ విజిలెన్స్ అధికారి బి వెంకన్న (ఐ.ఆర్.టి.ఎస్.) ఆధ్వర్యంలో ఈ విజిలెన్స్ విభాగం నిర్విరామంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. అవినీతికి నిర్మూలనకు ఉద్యోగులందరినీ చైతన్య పరుస్తూ ప్రతి ఒక్క సింగరేణి ఉద్యోగికి అవగాహన పరుస్తున్నట్లు చెప్పారు. వివిధ గనులపై అధికారులు, సూపర్ వైజార్లు, యూనియన్ నాయకులు తేలికపాటి ఉద్యోగాల కొరకు లంచాలు (డబ్బులు) అడిగితే నేరుగా విజిలెన్స్ అధికారులకు కార్మికులు సమాచారం ఇవ్వాలని సూచించారు. అందరికీ విజిలెన్స్ విధుల గురించి అవగాహన పరిచేందుకు 18 ఆగస్టు నుండి 17 నవంబర్ వరకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.



## 34 వేల 8 టేకు దుంగలు స్వాధీనం

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కొత్త మామిడిపల్లి గ్రామంలో అటవీ సిబ్బంది రైడ్ చేసి 34 వేల రూపాయల విలువగల 8 టేకు దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తాళ్ల పేట అటవీ రేంజ్ అధికారి సుష్మారావు గురువారం తెలిపారు. ఆమె కథనం ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు కొత్త మామిడిపల్లి గ్రామంలో (లడ్డు) అలియస్ గనిశెట్టి కార్తీక్ ఇంటిపై ఎఫ్ బి ఓ (డాగ్స్ స్కాడ్) సిబ్బంది అనిల్, హంటర్ల తో సోదాలు నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు. ఈ సోదాలలో కార్తీక్ నివాసంలో 8 టేకు దుంగల పరిమాణం 0.389 క్యూబిక్ మీటర్లు లభించాయని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.



## రైతు ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

### జిల్లా కలెక్టర్

**యాదాద్రి భువనగిరి, మహా:** రైతులు తెచ్చిన ధాన్యాన్ని తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ఏ సి ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతం మిషన్ పని చేయకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన కుప్పలు ఎన్ని తేమ శాతం వచ్చాయి, ఎన్ని కాంటా వేశారని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ధాన్యం తూర్పార పడుతున్న రైతుతో మాట్లాడుతూ.. ఎన్ని రోజులు అయింది కేంద్రానికి వచ్చి నిన్న వచ్చిన వర్షానికి ఏమైనా తడిసింధ అని అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు తేమ శాతం చెక్ చేసి ఎప్పటికపుడు ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు.

# వరద ఉధృతి తగ్గే వరకు వాగులు దాటోదు

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు




**యాదాద్రి భువనగిరి మహా :** వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలు వాగులు దాటొద్దని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం బీబీనగర్ మండలం రుద్రవెల్లి వద్ద మూసి వరద ఉద్ధృతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.జిల్లాలో రుద్రవెల్లి, సంగెం వద్ద రెండురోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మూసి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ఉధృతికి రుద్రవెల్లి జూలూరు, బొల్లేపల్లిసంగెం గ్రామాల మధ్య వరద ఉద్ధృతి తగ్గే వరకు రాకపోకలు బంద్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు ఎవరు కూడా వరద ప్రవాహం లో నుండి దాటడానికి సాహసం చేసి ప్రాణాల ముప్పు తెచ్చుకోవద్దని తెలిపారు. ప్రజలు ఫోటోలు దిగడానికి కానీ, చేపలు పట్టడానికి కానీ వెళ్ళవద్దని తెలిపారు. జిల్లాలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య సిబ్బంది అందరూ కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా వర్షాలు తగ్గిన తర్వాత కాచి వడపోసి చేర్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. దాని వలన వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. వర్షపు నీరు నిలిచిన చోట ఆయిల్ బల్స్ వెయ్యాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

## సదరు ఉత్సవ వేడుకలకు టియుడబ్ల్యూజే (ఐజేయు) కమిటీ జర్నలిస్టులకు ఆహ్వానం



**షాద్ నగర్, మహా:** యాదవులు అపురూపకంగా నిర్వహించుకునే సదర్ ఉత్సవాల వేడుకలను నవంబర్ రెండో తేదీన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో పెద్ద ఎత్తున నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమాని కలిసికట్టుగా ఉండి సదర్ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్న సంకల్పంతో. నియోజకవర్గం లోని ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పలుకుతున్నారు. యాదవ సదరు ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం టియుడబ్ల్యూజే (ఐజేయు).రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ. నియోజకవర్గ కమిటీ జర్నలిస్టులను మర్యాదపూర్వకంగా కలిసి సదర్ కార్యక్రమానికి ఆహ్వానం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆహ్వానం పలుకుతున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టియు డబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చెక్కల శ్రీశైలం.షాద్ నగర్ నియోజకవర్గం ప్రింట్ మీడియా అధ్యక్షులు బూర్గుల ఫణీంద్ర.ఉపాధ్యక్షులు మల్లికార్జున్ నాయక్. హెచ్ఎంటీవీ శ్రీనివాస్. ప్రచార కార్యదర్శి ఆంధ్రజ్యోతి శేఖర్. సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్. రంగారెడ్డి జిల్లా ఈసీ మెంబర్ ఇలియాస్,సమీ,సాబీర్, సదర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఏసీబీ వలలో ఇన్చార్జి ఎస్ఈ రామారావు

**యాదగిరిగుట్ట, మహా:** కాంట్రాక్టర్ నుండి లక్ష 90 వేల రూపాయలు లంచం తీసుకుంటు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము ఈఈ రామారావు ఏసిబి కి చిక్కారు.. ఈఈ వారం రోజుల క్రితం దేవాదాయ ధర్మాదాయ శాఖ SE గా బాధ్యతలు స్వీకరించారు ఆ యాదగిరిగుట్టలో లడ్డు కౌంటర్లు టెండర్ ద్వారా మిషనరీ సప్లై చేసిన కాంట్రాక్టర్ నుండి మిషనరీ ఖరీదు 11,50,000 ఆ బిల్లు ఇప్పించడానికి 20% కమిషన్ అడిగిన రామారావు. ఇద్దరి మధ్యలో ఒక లక్ష 90 వేల రూపాయలకు కుదిరిన ఒప్పందం కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించడంతో నిఘా పెట్టినా నల్గొండ ఏసీబీ అధికారులు రామారావు ఆడియో కాల్స్ డేటాను సేకరించి మేడిపల్లిలో నిన్న సాయంత్రం 1,90,000 ఇస్తుండగా పట్టుకున్నారు రామారావు కు సంబంధించిన యాదగిరిగుట్ట దేవస్థానంలో కూడా కొన్ని ఫైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈఈ రామారావుకు హైదరాబాదులోని ఎల్బీనగర్ లో ఉన్న ఇంటిపై కూడా రెండు టీములు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు.

# అక్బరుద్దీన్ షా ఖాద్రి దర్గాలో ఉర్సు ఉత్సవాలు



**షాద్ నగర్, మహా :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఫరూక్ నగర్ లోని నాగులపల్లి రోడ్డులో ఉన్న సయ్యద్ అక్బరుద్దీన్ షా ఖాద్రి దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ అజహరుద్దీన్ హాఫెజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిజ్వాన్ పాషా ఖాద్రీ, మునవర్ హాఫెజ్, ఎతేషాం, నదీమ్ హాఫెజ్, షోయబ్ హాఫెజ్ లు హాజరయ్యారు. ఇందులో భాగంగా ఫరూక్ నగర్ లోని జామియా మస్జీద్ దగ్గర నుంచి ర్యాలీగా గంధాన్ని తీసుకువెళ్లి అక్బరుద్దీన్ షా దర్గాలో పూలతో, చాదర్ లతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మీలాద్, నాతే షరీఫ్, భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా అతిథులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.


## మొగిలిగిద్దలో పంట నష్టం అంచనా

### రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా

**షాద్ నగర్, మహా:** ఇటీవల కురిసిన అకాల భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి వ్యవసాయ శాఖా అధికారులు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ధ గ్రామంలో పర్యటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా స్థానిక అధికారులతో కలిసి వరి పంటను పరిశీలించడం జరిగింది. అదే విధంగా రైతులతో మాట్లాడుతూ రైతులు అధైర్య పడకూడదనీ 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం జరిగితే వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తారని, నష్టపోయిన అన్ని గ్రామాల్లో అన్ని పంటలను పరిశీలించి నివేదికలను పంపించాలని అధికారులకు ఆదేశించడం జరిగిందని అధికారి స్పష్టం చేశారు. ఇట్టి పర్యటనలో ఫరూఖ్ నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, ఫరూక్ నగర్ వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్ మరియు రైతులు పాల్గొనడం జరిగింది..

## వరి ధాన్యం కొనుగోలులో అవినీతికి పాల్పడిన వారిపై కేసులు

### చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సి. ఎస్.) శశిధర్ రాజు



**మంచిర్యాల, మహా :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అవినీతికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సి. ఎస్.) శశిధర్ రాజు వెల్లడించారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జైపూర్ మండలంలో వరి ధాన్యం కొనుగోలు లో జరిగిన అవగతవగల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియలో అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సి. ఎస్.) శశిధర్ రాజు హెచ్చరించారు. 2024 25 రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జైపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో పాటు అవకతవకలలో భాగస్వామ్యులైన రామారావు పేట గ్రామంలోని సుముఖ ఆగ్రో ఇండస్ట్రీస్ యజమానులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి, 8 మంది రైతులు, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ లపై రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ జైపూర్ పోలీస్ స్టేషన్ లో 316 క్లాస్ 5, 318 క్లాస్ 4 సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నంబర్ 207/25 నమోదు చేశారని వెల్లడించారు. ఈ కేసులో 1 కోటి 39 లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని అన్నారు. జిల్లాలో 740 ఎకరాలలో 6 వేల 322.6 క్వింటాళ్ల ధాన్యమును 8 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి 1 కోటి 39 లక్షల రూపాయలు జమ చేసినట్లుగా ఆన్లైన్ ప్యాడి ప్రొక్యూర్ మెంట్ మేనేజ్మెంట్ సిస్టం లో తప్పుడు సమాచారాన్ని నమోదు చేశారని చెప్పారు. వీటితో పాటు రవాణా ఖర్చుల కింద 1.90 లక్షల రూపాయల ట్రక్ చిట్టీలు సృష్టించి నమోదు చేశారని తెలిపారు. జైపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతుందని వివరించారు.

# ధాన్యం కొనుగోలుకు అత్యంత ప్రాదాన్యత...జిల్లా కలెక్టర్



**యాదాద్రి భువనగిరి, మహా:** ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని నిన్న కురిసిన భారీ వర్షం నేపథ్యంలో రైతులకి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు జరగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం బీబీనగర్ మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని ధాన్యం కుప్పలు వచ్చాయని. ఇంకా పంట మీద ఎంత ధాన్యం ఉందని రైతులను అడిగి తెలుసుకున్నారు.వర్షాల కారణంగా ఏమైనా తడిసిందా. తడవకుండా టార్పాలిన్ లు కప్పుకోవాలని అని సూచించారు . పంట మీద ఉన్న వరి కూడా కొంచెం ఆరిన తరువాత కోత కోయాలని అని సూచించారు.కేంద్రంలో ఉన్న ధాన్యంను ఎంత మేరకు తేమ శాతం ఉందని పరిశీలించారు. తేమ శాతం వచ్చిన ధాన్యం ఎప్పటికపుడు కొనుగోలు చేసి లారీలకు లోడ్ చేసి మిల్లులకు తరలించాలి అని అన్నారు ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంట నష్టం కాకుండా... అధికారులు బాధ్యతాయుతంగా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. ట్రాక్ షీట్ అప్డేషన్ ఎప్పటికప్పుడు జరగాలని,ప్రతి కేంద్రంలో కనీస మౌలిక వసతులు ఉండాలన్నారు.జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన అన్ని ధాన్యం కేంద్రాలలో... కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రేపు ఎన్టీఆర్ ట్రస్టుకు నారా భువనేశ్వరి రాకా

## జిల్లా స్థాయి క్రీడా మరియు కల్చరల్ ఫెస్ట్ డీన్ రామారావు




**మొయినాబాద్ మహా:** మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డు పరిధిలోని ఎన్టీఆర్ కుటీరానికి ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ చైర్మన్ నారా భువనేశ్వరి రేపు శనివారం నవంబరు 1వ తేదిన రానున్నట్లు ఎన్టీఆర్ విద్యసంస్థల డీన్ రామారావు తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డులోని ఎన్టీఆర్ కుటీరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్ పేరిట జిల్లా స్థాయి క్రీడల పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫెస్ట్లో రంగారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు. పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ క్రీడల పోటీలను ప్రారంభించేందుకు మొదటి రోజు శనివారం నారా భువనేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలిబాల్, పలు సంస్కృతీక కార్యక్రమాల పోటీలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా గతంలో ఎన్టీఆర్ విద్యసంస్థల్లో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయిలో స్థిరపడిన వారికి సన్మాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ క్రీడలకు సంబందించిన పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రెడ్డి, సిబ్బంది మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెలలు గడిచిన తప్పని తిప్పలు

## ఆస్తవ్యస్తంగా చైతన్య యూనివర్సిటీకి వెళ్లే రోడ్డు



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డు పరిధిలోని రోడ్లు మురుగు నీటితో ఆస్తవ్యస్తంగా మారాయి. గ్రామంలో ఉన్న చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి వెళ్లే రోడ్డు మొత్తం మురుగునీటితో కంపుకొడుతుంది. అదే నీటిలో నుంచి విద్యార్థులు యూనివర్సిటీకి వెళ్లివస్తున్నారు. సమీపంలో నిర్మించిన వెంచర్లలో అండర్ డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో అందులో ఇళ్లు నిర్మించుకుని నివాసిస్తున్నవారు రోడ్డుపైకి మురుగు నీటిని వదిలేస్తుండడంతో ఇక్కడ సమస్యల నెలకొంది. మురుగు నీరు రోడ్డుపైకి వస్తుండడంతో దుర్వాసన పెరిగి వ్యాధులు ప్రబలే ఆస్కారముందని స్థానికులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు చైతన్య యునివర్సిటీకి వెళ్లే రోడ్డుపై మురుగు నీటిని వదులుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# మొయినాబాద్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు




**మొయినాబాద్ మహా:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్ లో ఉన్నటువంటి 8500 కోట్ల రూపాయల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్స్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మొయినాబాద్ లోని ఇంజనీరింగ్ కాలేజీలు శాంతియుతంగా బంధు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను గురువారం మొయినాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో కుమ్మక్కై, పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించడం సరైనది కాదని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్, బేగరీ అరుణ్ కుమార్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించకుండా వారి జీవితాలతో ఆడుకుంటుందని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్స్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డిగ్రీ ఇంజనీరింగ్ ఫార్మసీ బిఎడ్ తదితర విద్యాసంస్థల బందుకు పిలుపునిచ్చిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మొయినాబాద్ లో బంధు నిర్వహిస్తున్నటువంటి ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం సరైంది కాదన్నారు. పోలీస్ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. విద్యార్థి ఉద్యమాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఇప్పుడు విద్యార్థి ఉద్యమాలను చూసి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతోందని అన్నారు. వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్స్ విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, ఎస్ఎఫ్ఐ నాయకులు రిషి, ఆకాష్, విష్ణు, కైఫ్, వినయ్, లోకేష్, కైఫ్, శివ కుమార్, శ్రీనివాస్,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# కన్నీరే మిగిలింది..



**ఆమనగల్లు, మహా:** రెండు రోజులుగా కురిసిన వర్షం రైతులను నట్టేట ముంచింది.వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరు గాలం కష్ట పడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి కన్నెరతో పంటలు పూర్తిగా తడిచి అప్పులు మిగిలాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అపారంగా నష్టపోయిన తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం అని వాపోతున్నారు. భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు ఏరులై పారి చెరువులు కుంటలు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నా యి. వర్షాలు సకాలంలో పడి మెట్ట పంటలు సాగు కు అనుకూలంగా రైతులు అప్పులు చేసి పెద్ద సంఖ్యలో పత్తి,వరి పంటలు అధికంగా సాగు చేశారు. ఈ నేపథ్యంలో పత్తి తీసే సమయం, వరి కోత దశలో భారీ వర్షా లు కురిసి వేసిన పంటలన్నీ నీటిలో మునిగి పోయాయి. వరి నేలకొరిగింది. పంటలు నీట మునిగి ఉండడంతో మొలకెత్తుతున్నాయి. పత్తిదీ అదే పరిస్థితి. తడిచి మొలకెత్తాయి. అధిక వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్నివేడుకుంటున్నారు. పంటకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని కోరుతున్నారు.

**తెల్లబంగారం.. రైతు తెల్లబోయాడు**

రెండు రోజులుగా కురిసిన వర్షం పత్తి రైతులను నట్టేట ముంచింది. భారీ పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే చేతికి వచ్చే దశలో కురిసిన వర్షాలకు పగిలి తెల్ల బంగారం నల్లగా మారి తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు తెలిపారు. మండలంలో అధిక విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేశామని, పత్తి తీతకు కూలీలు దొరకక అలాగే వదిలేశామని, ఈ లోగా తుఫాన్ ఆశలను తుడిచేసిందని వాపోయారు.

**రెండు ఎకరాలు పూర్తిగా మునిగింది..**
**జంగయ్య గౌడ్, మర్రిపల్లి**

అప్పులు చేసి పత్తి, వరి పంట సాగు చేశాను. రెండు ఎకరాలుపూర్తిగా పాడైపోయింది. ఎకరాకు 40 వేల వరకు ఖర్చువచ్చింది.చేతికొచ్చిన పంట నాశనమైంది. పంట బాగా పండితేపోయిన ఏడాది తెచ్చిన అప్పు తీరుద్దామనుకున్నా. ఇంతలోపంట మొత్తం మునిగింది. ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని ఆశించా.వరుణుడు కన్నెర చేశారు. పంట మొత్తం మునిగింది. పత్తిగింజలు మొలకెత్తుతున్నాయి. చేతికొచ్చిన పంట నాశనం అవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాను.ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.



## చెరువుకు జల హారతి..

# అమ్మకు చీర, సారె

**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లిలోని వెల్జాల్ సహదేవ్ సముద్రం చెరువు నిండడంతో గురువారం గ్రామస్తులు చెరువుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహదేవమ్మ మాతకు చీరే, సారె సమర్పించారు. అలుగు ప్రాంతంలో జల హారతి చేపట్టి బలి వేడుకను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



## సీజేఐపై దాడి అంటే

# దళితులపై దాడి

**ఆమనగల్లు, మహా:** సీజేఐపై దాడి నిరసిస్తూ నవంబర్ ఒకటిన ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పేరుతో నిర్వహించే దళితుల ఆత్మ గౌరవ ప్రదర్శనకు మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండలఅధ్యక్షుడు కావలి శ్రీశైలం కోరారు. గురువారం ఆమనగల్లులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సీజేఐపై దాడి అంటే దళితులపై దాడి అని మన ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం భారీగా తరలిరావాలని కోరారు. ఉపాధ్యక్షుడు వస్పుల శ్రీరాములు, రాకేష్,భీముడు, శాంసన్, వంశీ,రాహుల్, పాల్గొన్నారు.

## మీసేవ సెంటర్

# లైసెన్స్ రద్దు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మండల పరిధిలోని మండల పరిధిలోని కిషోర్ కమ్యూనికేషన్ మీసేవ సెంటర్ యొక్క లైసెన్స్ ఈనెల 27 నుండి శాశ్వతంగా రద్దు చేయడం జరిగిందని ఆమనగల్లు తహసిల్దార్ ఫహీమ్ గురువారం ఓ ప్రకటనలు తెలిపారు. కమిషనర్ ఈఎస్డి మీసేవ హైదరాబాద్ వారిఉత్తర్వులు ప్రకారం శాశ్వతంగా రద్దు చేయడం జరిగిందని, ప్రజల దీనిని గమనించి మీ సేవలో ఎటువంటి సేవలు జరగవున్నారు.




# దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో వరి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. గురువారం ఆయన కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించారు. తుఫాన్ వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా వర్షం ధాటికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆదిశగా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పంటనష్టం వివరాలను సేకరించాలని ఎమ్మెల్యే సూచించారు.పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం ద్వారా అందేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి డైరెక్టర్ యాదమ్మ మార్కెట్ డైరెక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి,మాజీ సర్పంచులు కడమోని శ్రీశైలం రమేష్,జైపాల్ రెడ్డి,వ్యవసాయ అధికారి రేణుక,పిఎసిఎస్ సీఈవో ప్రతాప్ రెడ్డి గ్రామస్తులు జగ్గారెడ్డి, గౌస్,పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు

## ముష్కిన్ చెరువు అభివృద్ధిలో

# చారిత్రాత్మక ముందడుగు



**గండిపేట,మహా:** గండిపేట మండలంలోనీ ముష్కిన్ చెరువు సుందరీకరణ పనులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చారిత్రాత్మకమైన ముందడుగు వేసారు. గురువారం ముష్కిన్ చెరువు సుందరీకరణ పనులకోసం కోసం తత్వ ఆర్గనైజేషన్ సంస్థ ముందుకు రావటంతో వారి ఆధ్వర్యంలో చెరువును అభివృద్ధి పరచడానికి చెరువు పరిసర ప్రాంత కాలనీ వాసులు,దేవాదాయ కమిటీ సభ్యులు,రైతులు,ఇరిగేషన్ శాఖ అధికారులు మరియు తత్వ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులతోసమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ తత్వ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 60 ఎకరాలలో ముష్కిన్ చెరువు సుందరీకరణ పనులను త్వరలోనే ప్రారంభిస్తుందని,అందుకోసం వారం రోజుల వ్యవధిలో ప్రభుత్వ భూముల సర్వేను పూర్తి చేసి, ఎఫ్ టి ఎల్ పరిధిలోని భూముల యజమానులకు ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందించి భూములను స్వాధీనం చేసుకుని చెరువును సుందరీకరిస్తామన్నారు. అనధికారికంగా ఆక్రమించిన స్థలాలను తొలగించి సరిహద్దులను ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమంగా స్థలాలను ఆక్రమించి కబ్జాలు చేస్తే చట్టరీత్యా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ చెరువు సుందరీకరణ ద్వారా వర్షపు నీటి నిల్వలు మెరుగుపడడమే కాకుండా భూగర్భ జలాల పెరుగుదల మరియు స్వచ్ఛమైన గాలి తదితర ప్రయోజనాలు కలుగుతాయని అందుకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో హాల్ మార్క్, వికీనియా, మై హోమ్ అవతార్ ప్రతినిధులు గౌతం,లింగరాజు,రవీంద్రాచారి, ఇరిగేషన్ శాఖ అధికారులు డి ఈ రమాదేవి,ఏ ఈ నరేంద్ర,తత్వ సంస్థ ప్రతినిధి రాకేష్,రైతులు బట్ట సత్య నారాయణ,బట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

## మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజలకు రక్షణ కల్పిస్తూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల వీరత్వం మరవలేనిదని మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి తెలిపారు. శాంతి భద్రతలు నెలకొల్పడంలో ప్రజల భాగస్వామ్యం పోలీసులకు ఎంతో అవసరమని గుర్తు చేశారు. పోలీస్ అమరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఇబ్రహీంపట్నం ఏసీపి రాజు ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డిసిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు సీఐలు మహేందర్ రెడ్డి, సత్యనారాయణ, రవికుమార్, నందీశ్వర్ రెడ్డి, మధు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, పలు కళాశాలల విద్యార్థులు, డీసీపీ సమక్షంలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందరికీ పండ్లు జ్యూస్ ఆమె అందజేశారు. విద్యార్థులు, యువకులు రక్తదానం చేసేందుకు వందలాదిగా ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ... భారత్, చైనా సరిహద్దులో 1959 అక్టోబర్ 21న లడక్ లో జరిగిన ఘటనలో అనేక మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. భారత పోలీసులు కొంతమంది, చైనీస్ మిలిటరీకి చిక్కడంతో నిర్దాక్షిణ్యంగా జరిపిన కాల్పుల్లో మృతి చెందారని తెలిపారు. మృతదేహాలను కూడా చైనీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. సుమారు మూడు వారాల తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన అనేక చర్చల అనంతరం మృతదేహాలతో పాటు వారి ఆధీనంలో ఉన్న పోలీసులను విడుదల చేశారని వివరించారు.

**1960 అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవం....**

భారత ప్రభుత్వం 1960 అక్టోబర్ 21నుంచి పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అంతే కాకుండా విధి నిర్వహణలో అనేకమంది ఆయా సందర్భాల్లో పోలీసులు అమరులయ్యారని గుర్తు చేశారు. మంచాల, యాచారం పోలీస్ స్టేషన్లో మందు పాతర పేల్చిన ఘటనలో, ఎస్సైలు కానిస్టేబుల్స్ అమరులైన వారి త్యాగాలను కొనియాడారు. అక్టోబర్ 21 పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని వారి కుటుంబాలను రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో తమ పోలీసులు కలిసి కుటుంబ స్థితిగతులు తెలుసుకోవడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం తగిన సహాయాన్ని వారికి చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఇటీవల నిజామాబాదులో జరిగిన ఘటనలో ఓ నిందితుని అరెస్టు చేసి మోటార్ సైకిల్ పై తీసుకుని వెళ్తున్న క్రమంలో నిందితుడు తన వద్ద ఉన్న కత్తితో, ప్రమోద్ అని కానిస్టేబుల్ ను హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కోటి రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని, తమ పోలీసు శాఖ అండగా నిలుస్తోందని కుటుంబానికి భరోసా ఇచ్చారు.

**అమరుల త్యాగాలను కొనియాడుతూ...**

అక్టోబర్ 21 నుంచి వారోత్సవాలలో భాగంగా కొవ్వొత్తులు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆపదలో ఉన్న అభాగ్యులను కొన్ని ప్రాణాలను కాపాడందుకే రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి తమ వంతు సహకారాన్ని, మద్దతును తెలియజేస్తున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ పై యువత అప్రమత్తంగా ఉండాలని, ఈ అంశాన్ని తీసుకొని ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించామన్నారు. విధి నిర్వహణలో స్త్రీ, పురుష బేధం చూపించవద్దని తెలియజేస్తూ పోలీసు సిబ్బందికి సైతం వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలో పాల్గొన్న వారి వివరాలను ప్రత్యేక వెబ్ సైట్ లో పొందుపరిచామని, రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వివరించారు.

**ప్రజలకు రక్షణ కల్పించడం వెనుకడుగు వెయ్యం...**

ప్రజలకు రక్షణ కల్పించడం కోసం విధి నిర్వహణలో పోలీసులు వెనకడుగు వేయకుండా ముందుకే సాగుతున్నామని తెలిపారు. మహిళలు, యువతులు, విద్యార్థిని విద్యార్థులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. వారిని సన్మార్గంలో నడిపించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రజలతో మమేకమై పోలీసులు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని గుర్తు చేశారు. తద్వారా శాంతిని నెలకొల్పడం సాధ్యమవుతుందన్నారు. రక్తదాన శిబిరంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు మహేందర్ రెడ్డి, సత్యనారాయణ, రవి కుమార్, నందీశ్వర్ రెడ్డి, మధు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

**"మన రక్తదానం – మరొకరి ప్రాణదానం"....**

"మన రక్తదానం - మరొకరి ప్రాణదానం" అనే భావనను ముందుకు తీసుకెళ్తూ, సమాజానికి కల్పించిన సేవకు వీరు చేసిన ఆధునిక స్ఫూర్తిదాయక భాగస్వామ్యాన్ని అందరూ అభినందించాలి. ఈ రక్తదాన శిబిరంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి రక్తదానం చేశారు.

# అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలి

## సీఎం రేవంత్ రెడ్డి




**వరంగల్ మహా;** మొంథా తుఫాన్ నేపథ్యంలో మంత్రులు, అధికారులు తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొంథా తుఫాన్ సహాయక చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుండి మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిసిపి అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణి లు, ఎన్ డి ఆర్ ఎఫ్ టి సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ వీసీ లో సీఎం మాట్లాడుతూ శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తామని తుఫాను ప్రభావిత ప్రాంతాల జిల్లా ఇంచార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించి అందుబాటులో ఉండాలని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని... ఇది వరి కోతల కాలం... అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని... అందరి సెలవులను రద్దు చేయాలని సూచించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని రోడ్లపై బ్రిడ్జిలలో లెవల్ కాజ్ వే ల వద్ద, దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలన్నారు అవసరమైన చోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరంగల్ లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించు కోవాలన్నారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని... అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రాజెక్టుల ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదన్నారు.

**మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ**

వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ప్రజల ప్రాణాల రక్షణ కోసం జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుందని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని, వరదలో చిక్కుకున్న వారికి డ్రోన్ ద్వారా ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం అహర్నిశలు ప్రజల వెంటే ఉంటున్నారని, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించుట మరిన్ని పడవలు కావాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షపాతం వలన లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావసం కల్పించుటకు 9 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు 1100 మందికి షెల్టర్ కల్పిస్తూ మౌలిక వసతులు కల్పించామని డిఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంటూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు అప్రమత్తం చేయుటలో జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు అందిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. వర్ష ప్రభావం వల్ల కలిగిన నష్టాలను వివిధ శాఖల అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి క్షేత్ర స్థాయి లో పరిశీలనలు జరిపి నివేదికలను సమర్పించాలన్నారు. అత్యవసర సహాయార్థం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 3424. జి డబ్ల్యూ ఎం సి 1800 425 1980 టోల్ ఫ్రీ నెంబర్స్ లకు సంప్రదించాలని ప్రజలను కలెక్టర్ కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అధైర్య పడకండి ప్రభుత్వం అండగా ఉంది

## వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి, కలెక్టర్




**వరంగల్ మహా;** మొంథా తుఫాన్ కారణంగా అతిభారీ వర్షంతో గ్రేటర్ వరంగల్ నగరం అతలాకుతులమైంది. వరద ఉధృతి పెరగడంతో నగరంలోని నువ్వు తట్టు ప్రాంతాలతో పాటు పలు కాలనీలు జలమయం కాగా మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఉదయం ఏడు గంటలకు వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలను గురించి విధుల్లో ఉన్న అధికారులతో ఆయా కాలనీల పరిస్థితులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకుంటూ సహాయక చర్యలు ముమ్మరం చేశారు. వరద తీవ్రత అధికంగా ఉన్న ఎన్ ఎన్ నగర్, బీఆర్ నగర్ కాలనీల్లో మంత్రితో కలిసి కలెక్టర్ తాజా స్థితిగతులను అడిగి తెలుసుకుని రెవెన్యూ, పోలీస్, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ డిఆర్ఎఫ్ బృందాలు అందిస్తున్న సహాయక చర్యలను పరిశీలించారు. కొంతమంది వరద ఉధృతికి ఇండ్లలోనే చిక్కుకున్న వారికి డ్రోన్ల ద్వారా ఆహారం, మంచినీళ్లను అందించారు. ఆయా ప్రాంతాలలోని కాలనీలు, వరద నీటిలో చిక్కుకోగా వారిని సురక్షిత ప్రాంతాలకు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇంకా వరద నీటి వల్ల ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు వరద ప్రభావ పరిస్థితుల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సగానికి సగం పడిపోయిన టాప్ ఐటీ కంపెనీ లాభాలు

దేశీయంగా భారీ సంఖ్యలో ఉద్యోగులను కలిగిన ఐటీ సర్వీసుల దిగ్గజం కాగ్నిజెంట్ ఈ ఆర్థిక సంవత్సరం(2025) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జూలై-సెప్టెంబర్(క్యూ3)లో యూఎస్ కంపెనీ నికర లాభం 53 శాతం క్షీణించి 27.4 కోట్ల డాలర్లకు పరిమితమైంది. ఈ కాలంలో 39 కోట్ల డాలర్లమేర నగదేతర ఆదాయ పన్ను వ్యయాల కారణంగా లాభాలు దెబ్బతిన్నట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024) క్యూ3లో 58.2 కోట్ల డాలర్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 7 శాతంపైగా ఎగసి 541.5 కోట్ల డాలర్లను తాకింది. ఏఐలో పెట్టుబడులు ఇందుకు సహకరించగా.. పూర్తి ఏడాదికి ఆదాయ అంచనాలను తాజాగా మెరుగుపరచింది. వెరసి ఇంతక్రితం ప్రకటించిన 20.7-21.1 బిలియన్ డాలర్లను 21.05-21.1 బిలియన్ డాలర్లకు సవరించింది. కంపెనీ జనవరి-డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే.

ఈ బాటలో చివరి త్రైమాసికం(అక్టోబర్-డిసెంబర్)లో 5.27-5.33 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆశిస్తోంది. ఈ క్యూ3లో ఆర్డర్ల బుకింగ్స్ 5 శాతం నీరసించగా.. 6,000 మంది ఉద్యోగులను జత చేసుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 3,49,800ను తాకింది. ఈ ఏడాది 15,000-20,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించే బాటలో సాగుతున్నట్లు కంపెనీ వెల్లడించింది.





## కాపర్‌కు పెరుగుతున్న డిమాండ్

దేశీయంగా కాపర్‌కు డిమాండ్ బలపడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 1,878 కిలో టన్నులకు చేరుకుంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో డిమాండ్ 1,718 కిలో టన్నులతో పోల్చి చూసినప్పుడు 9.3 శాతం పెరిగింది. ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా (ఐసీఏ ఇండియా) ఈ వివరాలను నివేదిక రూపంలో విడుదల చేసింది. ఆర్థికంగా పురోగమిస్తుండడం, కీలక రంగాల్లో కాపర్ వినియోగం పెరుగుతుండడం డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిపింది. భారీ స్థాయి మౌలిక ప్రాజెక్టులు, భవన నిర్మాణాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ విద్యుత్ సామర్థ్యాల విస్తరణ వంటివి డిమాండ్‌ను అధికం చేస్తున్నాయని పేర్కొంది. ముఖ్యంగా గత ఆర్థిక సంవత్సరంలో భవన నిర్మాణ రంగం నుంచి కాపర్‌కు డిమాండ్ 11 శాతం పెరగ్గా, మౌలిక సదుపాయాల రంగం నుంచి 17 శాతం అధికంగా ఉన్నట్టు తెలిపింది. ''భారత్‌లో ఆర్థిక, పారిశ్రామిక పురోగతికి అనుగుణంగా కాపర్ డిమాండ్ పెరుగుతోంది. పునరుత్పాదక ఇంధన వనరులు, సుస్థిర రవాణా పరిష్కారాలు, మౌలిక వసతుల అభివృద్ధి కాపర్ డిమాండ్‌ను పెంచుతున్నాయి. దేశ అభివృద్ధికి కీలక వనరుగా కాపర్ తనవంతు పాత్రను తెలియజేస్తోంది''అని ఐసీఏ ఇండియా తెలిపింది. అయితే వికసిత్ భారత్ ఆకాంక్షకు అనుగుణంగానే ప్రస్తుత కాపర్ డిమాండ్ ఉందా? అని ప్రశ్నించుకోవాలని ఏసీఏ ఇండియా ఎండీ మయాంక్ కర్మార్కర్ పేర్కొన్నారు. కాపర్ నిల్వలను అభివృద్ధి చేసుకోవడం, దేశీ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసుకోవడం ద్వారా భవిష్యత్ డిమాండ్‌ను చేరుకోవచ్చని సూచించారు.

## భవిష్యత్తు బంగారం


బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రోజుకో కొత్త ధరకు చేరుతూ సామాన్యులకు అందనంత దూరంగా జరిగిపోతోంది పసిడి. ఇన్వెస్టర్లు సైతం స్వర్ణంపై సంపూర్ణ విశ్వాసం పెట్టలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో 'భవిష్యత్ బంగారం'గా మరో లోహం ఆశలు పూయిస్తోంది. అదే 'రాగి' (Copper). మల్టీ నేషనల్ మైనింగ్ సంస్థ వేదాంతా గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ కాపర్‌ను 'తదుపరి బంగారం'గా అభివర్ణించారు. ఇది క్లీన్ ఎనర్జీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన రంగాలలో ఎక్కువగా ప్రాముఖ్యతను పొందుతోందని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి మౌలిక సదుపాయాలు, ఏఐ, రక్షణ పరికరాలలో కాపర్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను ఆయన ప్రస్తావించారు. కెనడాలోని బారిక్ గోల్డ్ సంస్థ తన పేరులో గోల్డ్ పదాన్ని తొలగించి కేవలం 'బారిక్'గా మార్చడం గ్లోబల్ స్థాయిలో కాపర్ గనులపై దృష్టి మారే సంకేతంగా ఆయన పేర్కొన్నారు.

## ఒంటినిండా నగలు ధరిస్తే.. రూ. 50వేలు జరిమానా!




బంగారు నగలు ఉంటే.. ఎవరికైనా ధరించుకోవాలని, ఓ నలుగురికి చూపించుకోవాలని ఉంటుంది. అయితే ఇలాంటి ఆడంబరాలకు స్వస్తి పలకడానికి.. ఉత్తరాఖండ్‌లోని జౌన్సర్‌బావర్ గిరిజన ప్రాంతంలోని కంధర్ గ్రామ నివాసితులు ఒక వింత నిర్ణయం తీసుకున్నారు. దీనిని ఉల్లంఘించిన వారికి రూ. 50వేలు జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. ఆడంబరాలను అరికట్టడానికి మాత్రమే కాకుండా.. ఆర్థిక అసమానతలను తగ్గించడానికి గ్రామ పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని అక్కడి మహిళలు కూడా స్వాగతించారు. ఇకపై అక్కడి మహిళలు వివాహాది శుభకార్యాలకు వెళ్లినా.. కేవలం చెవిపోగులు, ముక్కుపుడక, మంగళసూత్రం మాత్రమే ధరించాలి. ఇవి కాదని ఎవరైనా ఇతర బంగారు నగలను ధరిస్తే.. వారికి రూ. 50,000 జరిగిమానా విధించనున్నట్లు గ్రామపెద్దలు హెచ్చరించారు. బంగారం ధరలు రోజురోజుకి పెరుగుతూనే ఉన్నాయి. డబ్బున్నవారు గోల్డ్ కొనుగోలు చేస్తారు. పేదరికంలో ఉన్న వారికి ఇది సాధ్యం కాదు. బంగారం కొనాలని అప్పులు చేస్తే.. ఆర్థికంగా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబంలో అప్పులు పెరుగుతాయని కంధర్ గ్రామపెద్దలు.. కొత్త నిర్ణయం తీసుకున్న సందర్భంగా వివరించారు. వివాహం అనేది ఒక పవిత్రమైన ఆచారం. అది ప్రదర్శించడానికి వేదిక కాదు. ఆడంబరాలు/ప్రదర్శనలు అనే గోడలను కూల్చివేసినప్పుడే.. నిజమైన సమానత్వం సాధించబడుతుందని అక్కడి నివాసితులు నమ్ముతున్నారు. కొత్తగా తీసుకున్న నిర్ణయం.. ధనిక & పేద కుటుంబాల మధ్య పోల్చుకోవడం కొంత తగ్గుతుంది. అనవసరమైన ఖర్చులను అరికట్టవచ్చు. ఇది సామాజిక ఐక్యతను పెంపొందించడానికి కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

## మెరుగైన భారత్ కోసం ఏఐ.. రూ.1 కోటి బహుమతి




భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్.. తన జాతీయ విద్యా కార్యక్రమం 'శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025' నాల్గవ ఎడిషన్ విజేతలను ప్రకటించింది. ఈ కార్యక్రమం యువ విద్యార్థులు సాంకేతికతను వినియోగించి తమ స్థానిక కమ్యూనిటీల్లోని వాస్తవ ప్రపంచ సవాళ్లకు సృజనాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ప్రోత్సహిస్తుంది.

### మొదటి నాలుగు విజేత జట్లు

పెర్సెవియా (బెంగళూరు)
నెక్ట్‌స్ప్లే.ఏఐ (ఔరంగాబాద్)
పారస్పీక్ (గురుగ్రామ్)
పృథ్వీ రక్షక్ (పలాము)

ఐఐటి ఢిల్లీకి చెందిన ఎఫ్ఐటీటీ ల్యాబ్స్‌లో మెంటర్‌షిప్ మద్దతుతో, తమ ఆవిష్కరణాత్మక ప్రోటోటైప్లను స్కేలబుల్ రియల్‌వరల్డ్ పరిష్కారాలుగా అభివృద్ధి చేయడానికి రూ. 1 కోటి విలువైన ఇంక్యుబేషన్ గ్రాంట్లు అందుకున్నారు. జ్యూరీ ప్యానెల్‌లో.. శామ్‌సంగ్ మాత్రమే కాకుండా, విద్యా సంస్థలు, ప్రభుత్వం & పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. ఈ ప్యానెల్ నాలుగు ప్రధాన నేపథ్య ట్రాక్లలో ఫైనలిస్టుల పరిష్కారాలను అంచనా వేసింది. అత్యుత్తమ ప్రపంచాన్ని నిర్మించడంలో తమ సృజనాత్మకత & అంకితభావాన్ని ప్రతిబింబించినందుకు టాప్ 20 ఫైనలిస్ట్ జట్లు ఒక్కొక్కటి రూ 1 లక్ష నగదు బహుమతితో పాటు తాజా శామ్‌సంగ్ గెలాక్సీ Z ఫ్లిప్ స్మార్ట్‌ఫోన్‌లను కూడా అందుకున్నాయి. అదనంగా, ఈ కార్యక్రమం ఐదు ప్రత్యేక అవార్డుల కింద బహుమతులను అందించింది

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## చైనాపై సుంకాలు తగ్గిస్తున్నాం: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెత్తబడ్డారు. చైనాపై సుంకాలను 10 శాతం తగ్గిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. గురువారం దక్షిణ కొరియా బుసాన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ఈ ప్రకటన వెలువడింది. జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగిందని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. జేపీ మోర్గాన్ నివేదిక ప్రకారం.. 2018 దాకా చైనా ఉత్పత్తులపై అమెరికా సుంకాలు 05 శాతంగా ఉండేవి. అయితే 2021లో అది 20 శాతానికి చేరింది. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవి చేపట్టి టారిఫ్ వార్ మొదలుపెట్టాక చైనా విషయంలోనూ పెంపు ఉండొచ్చని అంతా భావించారు. అందుకు తగ్గట్లే అది 57 శాతానికి చేరింది. అయితే ఆ పెంపు 155 శాతం దాకా ఉంటుందని.. నవంబర్ 1వ తేదీ నుంచి అమలు అవుతుందని ఆయన హెచ్చరించారు కూడా. ఈలోపు.. పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు(APEC) సమ్మిట్ వేదికగా గురువారం ఈ ఇరు దేశాధినేతలు రెండు గంటలపాటు సమావేశం కాగా, చర్చలు ఫలవంతం అయ్యాయి. తాజా తగ్గింపుతో సుంకాలు 47 శాతానికి చేరాయి. ఇరు దేశాల సంబంధాల్లో ఇదొక అద్భుతమైన ఆరంభం అని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. టారిఫ్ తగ్గింపుతో పాటు సోయాబీన్ కొనుగోళ్ల పునరుద్ధరణ, అలాగే.. రేర్ ఎర్త్ ఎక్స్‌పోర్ట్స్‌కు సంబంధించిన ఒప్పందం కుదిరినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి ఇంతకు మించి ఏం చెప్పలేనన్న ఆయన.. ముఖ్యమైన అంశాలకు సంబంధించి వివరాలను కాసేపట్లో విడుదల చేస్తామని మీడియాకు తెలిపారు.

## ఎట్టకేలకు దొరికిన మ్యూజియం దొంగలు!

**ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లూవ్(లౌవ్ర్) మ్యూజియం చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పారిస్ పోలీసులు ధృవీకరించారు. అయితే వీళ్లు పింక్ పాంథర్ ముఠా సభ్యులేనా? అనేది మాత్రం ఇంకా ధృవీకరణ కాలేదు. ప్రస్తుతం వీరిని రహస్య ప్రాంతంలో అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.**





అక్టోబరు 19న పారిస్‌లోని లూవ్ మ్యూజియంలో జరిగిన చోరీ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది(louvre museum Heist). మ్యూజియంలో ఓ వైపు నిర్మాణం జరుగుతుండగా.. కన్‌స్ట్రక్షన్ కార్మికుల వేషాలు దుండగులు ఓ భారీ క్రేన్ ద్వారా వెనకభాగం నుంచి లోపలికి చొరబడ్డారు. ఉదయం 10గం. ప్రాంతంలో సరుకు రవాణా ఎలివేటర్(Basket Lift) ద్వారా అపోలో గ్యాలరీలోకి ప్రవేశించారు. నెపోలియన్ చక్రవర్తి కాలంనాటి వస్తువులు, ఆభరణాలు ఉన్న గ్యాలరీ అద్దాలను పగలగొట్టి అందులోని తొమ్మిది వస్తువులను దొంగలించి బయటపడ్డారు. ఇదంతా కేవలం ఏడు నిమిషాల్లోనే జరిగిపోవడం గమనార్హం. ఆ ఆభరణాల విలువ 88 మిలియన్ యూరోలు (భారత కరెన్సీలో దాదాపు రూ.895 కోట్లు) ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు దాదాపు 100 మందితో కూడిన అంతర్జాతీయ దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే.. ప్రస్తుతం అదుపులోకి తీసుకుంది అనుమానితులా? లేదంటే దొంగలేనా? అనేది ధృవీకరణ కావాల్సి ఉంది. అలాగే నగల రికవరీ ఇంకా జరగలేదని తెలుస్తోంది. అంతేకాదు.. ఈ చోరీకి సంబంధించి మరో ఇద్దరు, ముగ్గురిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని, వాళ్లే ఈ చోరీకి ప్రధాన సూత్రధారులని తెలుస్తోంది.

### పింక్ పాంథర్ ముఠా గురించి..

లూవ్ మ్యూజియం చోరీ వెనుక పింక్ పాంథర్ ముఠా హస్తం ఉందా? అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అందుకు కారణం.. చోరీ జరిగిన విధానమే!. 2001లో సెర్బియా బెల్గ్రేడ్ కేంద్రంగా డ్రాగన్ మైకిక్ అనే వ్యక్తి ఈ ముఠాను ప్రారంభించారు. ఆభరణా దొంగతనాలకు ఈ ముఠా పెట్టింది పేరు. స్మోక్ బాంబులు, గేట్‌వే కార్లు ఉపయోగిస్తూ సినీ ఫక్కీలో చోరీలు చేయడం ఈ ముఠా స్టైల్. అందుకే 1963లో వచ్చిన ది పింక్ పాంథర్ అనే సినిమా ఆధారంగా ఇంటర్‌పోల్ ఈ గ్యాంగ్‌కు ఆ పేరు పెట్టింది. ప్రస్తుతం ఈ గ్యాంగ్‌లో సుమారు 800 మంది సభ్యులు ఉన్నారని, యుగోస్లావియా యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఈ ముఠాతో సంబంధాలు ఉన్నాయని చెబుతుంటారు. యూరప్, ఆసియా, మిడిల్ ఈస్ట్‌లో ఇప్పటిదాకా 370కి పైగా దొంగతనాలు చేయగా.. చోరీ చేసిన వాటి విలువ 500 మిలియన్ డాలర్లు (సుమారు రూ.4200 కోట్లు) ఉండొచ్చని అంచనా. దుబాయ్ మాల్‌లో 2007లో పట్టపగలే చేసిన భారీ చోరీ, 2004లో టోక్యోలో కాస్ట్‌లీ డైమండ్ దొంగతనంతో పాటు లండన్, జెనీవా మ్యూజియాల్లో విలువైన చోరీలు చేసింది ఈ పింక్ పాంథర్ గ్యాంగ్. అయితే.. ఈ ముఠా చేసిన చోరీల్లో వస్తువులు రికవరీ కావడం చాలా తక్కువ. ఆభరణాలను ముక్కలు చేసి అమ్మేస్తుండడంతో చాలా కేసులు సాల్వ్‌కాకుండా ఉండిపోయాయి.

## నేపాల్ జెన్-జీ ఆందోళనలు.. ఆ కార్లను తుక్కుగా అమ్మేస్తున్నారు




**కఠ్మాండూ:** నేపాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత(జెన్‌జీ) చేపట్టిన ఆందోళనల్లో దహనమైన కార్లను ఇప్పుడు ప్రభుత్వం తుక్కు కింద జమకట్టి.. కిలోల్లా అమ్మేస్తోంది. ఆగస్టు నెలలో జెన్‌జీ ఉద్యమం తారాస్థాయికి చేరుకోవడంతో యువత పార్లమెంట్ భవనం, సుప్రీం కోర్టు, ప్రభుత్వ అధినేతల ఇళ్లు, రోడ్లపై పార్క్ చేసిన వాహనాలను దహనం చేసిన విషయం తెలిసిందే..! ఆందోళనలతో దెబ్బతిన్న వాహనాలను ఇప్పుడు తుక్కు కింద అమ్మడం తప్పితే.. ఎలాంటి ఉపయోగం ఉండదని, వాటి శకలాలను పార్లమెంట్, ఇతర ప్రభుత్వ భవనాల ఆవరణలో పెట్టడం వల్ల స్థలాభావం తప్పదని ప్రభుత్వ ఇంజనీర్లు పేర్కొన్నారు.


### కిలోకు రూ.45 రూపాయలు

అగ్నికి ఆహుతైన వాహనాల నుంచి ఇనుమును వేరు చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఇంజన్లు సక్రమంగా ఉన్న వాహనాలను వేలం వేయాలని నిర్ణయించింది. అయితే.. ఎందుకూ పనికిరాకుండా ఉన్న వాహనాల నుంచి సేకరించిన ఇనుమును తుక్కుగా అమ్మేయడానికి రంగం సిద్ధం చేసింది. బన్వేశ్వర్‌లో నిర్ణయించిన వేలంలో ఓ స్క్రాప్ వ్యాపారి కిలోకు రూ.45 చొప్పున చెల్లించి, కార్ల తుక్కును కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

### తొలి దశలో ఈ వాహనాల వేలం..

తొలి దశలో సింఘా దర్బార్ వద్ద ఉన్న 145 కార్లు, 256 ద్విచక్ర వాహనాలు, రెండు బస్సుల స్క్రాప్‌ను వేలం వేయాలని నిర్ణయించినట్లు పట్టణాభివృద్ధి శాఖ సెక్షన్ ఆఫీసర్ కేశవ్ శర్మ మీడియాకు తెలిపారు. ప్రధాని కార్యాలయం, అధికారిక నివాసం సహా.. 22 చోట్ల వాహనాల శకలాలు పడి ఉన్నాయని ఆయన చెప్పారు. వాటన్నింటినీ దశల వారీగా వేలం వేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రాంగణంలో 500 వాహనాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల వద్ద దహనమైన కార్లు, వాహనాల తుక్కును తదుపరి దశలో వేలం వేయాల్సి ఉందని వివరించారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయం మేరకే తుక్కుగా కార్ల విక్రయం ప్రారంభమైందన్నారు.

# ప్రభాస్‌తో ఢీ





వరుస పాన్ ఇండియా చిత్రాలతో దూసుకెళుతున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఆయన మారుతి దర్శకత్వం వహిస్తున్న 'ది రాజా సాబ్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' వంటి ప్రాజెక్ట్‌స్‌కి పచ్చజెండా ఊపారు ప్రభాస్. 'అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించనున్న చిత్రం 'స్పిరిట్'. త్రిప్తీ దిమ్రి హీరోయిన్‌గా నటించనున్న ఈ మూవీలో కాంచన, ప్రకాశ్‌రాజ్, వివేక్ ఓబెరాయ్ ఇతర పాత్రలు పోషించనున్నారు. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలో సెట్‌స్‌పైకి వెళ్లనుంది. ఈ సినిమాలో ప్రభాస్ పవర్‌ఫుల్ ఐపీఎస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రంలో కొరియన్ నటుడు డాన్ లీ విలన్‌గా నటించనున్నారన్న ప్రచారం జరుగుతోంది. ప్రభాస్‌కు సమానంగా పోటీ ఇచ్చే శక్తిమంతమైన ప్రతినాయకుడి పాత్రకి డాన్ లీ సరిపోతారంటూ ప్రభాస్ ఫ్యాన్స్ ఆన్‌లైన్‌లో పోస్టులు పెడుతున్నారు. అయితే 'స్పిరిట్'లో డాన్‌లీ విలన్‌గా నటిస్తున్నారా? లేదా అనే విషయంపై స్పష్టత రావాలంటే యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. కాగా కొరియన్ మీడియాలో మాత్రం ప్రభాస్ సినిమాలో డాన్ లీ ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. "స్పిరిట్' అనే సినిమాలో డాన్ లీ నటిస్తున్నారు. ఈ సినిమాకి సందీప్ రెడ్డి వంగా దర్శకుడు. 'బాహుబలి' సినిమాతో ఫేమస్ అయిన ప్రభాస్ హీరోగా నటిస్తున్నారు. ఇందులో డాన్ లీ నెగటివ్ పాత్రలో కనిపిస్తారనే వార్త వినిపిస్తోంది" అని కొరియన్ మీడియాలో వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఒకవేళ ఈ వార్తలు నిజమైతే ఇక దర్శక–నిర్మాతలు అధికారికంగా ప్రకటించడమే ఆలస్యం.



# హిందీ జేజెమ్మ?


అనుష్కా శెట్టి కెరీర్‌లోని బ్లాక్‌బస్టర్ మూవీ 'అరుంధతి'. కోడి రామకృష్ణ దర్శకత్వంలో శ్యామ్ ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం 2009లో విడుదలైంది. ఈ చిత్రంలో అనుష్క చేసిన రెండు పాత్రల్లో 'జేజెమ్మ'గా ఆమె నటన అందర్నీ ఆకట్టుకుంది. ఇప్పుడు హిందీ జేజెమ్మగా శ్రీలీల కనిపించనున్నారని టాక్. 'అరుంధతి' చిత్రం హిందీలో రీమేక్ కానున్నట్లుగా ఎప్పట్నుంచో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు ఈ పనులు ఊపందుకున్నాయని, 'అరుంధతి' హిందీ రీమేక్‌ను నిర్మించాలని అల్లు అరవింద్ సన్నాహాలు మొదలుపెట్టారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్‌స్‌లో వినిపిస్తోంది. అంతేకాదు... ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తారని, తమిళ దర్శకుడు మోహన్ రాజా దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నారనే ప్రచారం సాగుతోంది. మరి... హిందీ తెరపై 'అరుంధతి'గా శ్రీలీల కనిపిస్తారా? 16 సంవత్సరాల తర్వాత 'అరుంధతి' సినిమా హిందీలో రీమేక్ అవుతుందా? అనే విషయాలపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.




# సెగలు పుట్టించేలా దుల్కర్ సల్మాన్ Rage Of Kaantha ట్రాక్

మల్టీ టాలెంటెడ్ యాక్టర్ దుల్కర్ సల్మాన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ప్రాజెక్ట్ కాంత. సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్‌లో పీరియడ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్లకు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రాన్ని నవంబర్ 14న సోలోగా విడుదల చేస్తున్నట్టు తెలియజేస్తూ మేకర్స్ ఓ పోస్టర్ కూడా షేర్ చేశారు. తాజాగా ఈ మూవీ నుంచి రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను లాంచ్ చేశారు మేకర్స్. జాను చెంతర్ కంపోజ్ చేసిన ఈ పాటను సిద్ధార్థ్ బస్రూర్ పాడాడు. ర్యాప్ స్టైల్‌లో సాగుతున్న ఈ ట్రాక్ పాత్రలోని డిఫరెంట్ షేడ్‌స్‌ను చూపిస్తూ సినిమా ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తుంది. ఇటీవలే ఈ మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేయగా.. దుల్కర్ సల్మాన్, భాగ్య శ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్‌స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా రాబోతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

# చిరంజీవి డైరెక్టర్‌ను లైన్‌లో పెట్టిన రవితేజ..!



టాలీవుడ్ యాక్టర్ రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులు, ఫాలోవర్లను ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. భాను బోగవరపు డైరెక్షన్‌లో నటిస్తోన్న మాస్ జాతర అక్టోబర్ 31న థియేటర్లలో సందడి చేయనుంది. రవితేజ మరోవైపు కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్‌టీ 76 ప్రాజెక్ట్‌ను కూడా లైన్‌లో పెట్టగా.. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఈ రెండు సినిమాలు విడుదల కాకముందే రవితేజకు సంబంధించిన మరో ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. రవితేజ ఈ సారి చిరంజీవి డైరెక్టర్‌తో సినిమా చేసే ప్లాన్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఇంతకీ అతడెవరనే కదా మీ డౌటు. బింబిసారతో సూపర్ హిట్ అందుకుని ప్రస్తుతం చిరంజీవితో విశ్వంభర తెరకెక్కిస్తున్న వశిష్ఠ మల్లిడి. ఈ టాలెంటెడ్ డైరెక్టర్ ఇటీవలే రవితేజకు ఓ ఐడియా చెప్పాడని వార్తలు వస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ క్రేజీ కాంబోలో సినిమా ఒకే అవుతుందా..? అనేది ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉంటే ఇప్పటికే రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబోలో సినిమా వస్తుందని.. పాపులర్ రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ ఈ ఇద్దరి కోసం ఓ కథ రెడీ చేశాడని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. మరి వశిష్ఠ డైరెక్ట్ చేయబోయేది ఈ ప్రాజెక్ట్‌నేనా..? లేదంటే సెఫరేట్ సినిమా ఉండబోతుందా..? అనేది తెలియాల్సి ఉంది.



# వెండితెరపై మోహన్ లాల్ కూతురు


మలయాళ మెగాస్టార్ మోహన్‌లాల్ కుమార్తె విస్మయ మోహన్‌లాల్, త్వరలో నటిగా వెండితెరపై అరంగేట్రం చేయనున్న విషయం తెలిసిందే. 'తుడక్కమ్' అనే సినిమాతో విస్మయ పరిచయం కాబోతుండగా.. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో కొచ్చిలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. కొచ్చిలోని క్రౌన్ ప్లాజాలో జరిగిన ఈ వేడుకలో ముఖ్య అతిథిగా మోహన్‌లాల్‌తో పాటు, ఆయన సతీమణి సుచిత్ర, కుమారుడు ప్రణవ్ మోహన్‌లాల్ సహా చిత్ర బృందం పాల్గొంది. ఈ చిత్రానికి '2018' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాతో గుర్తింపు పొందిన దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహిస్తుండగా.. మోహన్‌లాల్‌కు అత్యంత ఆప్తులైన ఆంటోనీ పెరుంబావూర్ నేతృత్వంలోని ఆశీర్వాద్ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశీష్ ఆంటోనీ కూడా కీలక పాత్ర పోషించబోతున్నాడు. ఈ సినిమా పూజా కార్యక్రమం అనంతరం మోహన్‌లాల్ మాట్లాడుతూ తన జీవితంలో ప్రతిదీ ఒక 'విస్మయం' (ఆశ్చర్యం)గా భావించే తాను.. తన కుమార్తెను కూడా అదే పేరుతో పిలుచుకుంటానని తెలిపారు. తన పిల్లలు ఇద్దరూ (ప్రణవ్, విస్మయ) సినీ పరిశ్రమలోకి వస్తారని తాను ఎప్పుడూ ఊహించలేదని, ఇది ప్రేక్షకులే ఇచ్చిన ప్రేమ, ఆశీర్వాదం అని లల్లెట్టన్ పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్ మాట్లాడుతూ.. 'తుడక్కమ్' అంటే 'ప్రారంభం' అని. ఇది ఒక సాధారణ కుటుంబ చిత్రం అని జూడ్ తెలిపాడు.

# కల్కి క్రెడిట్ నుంచి దీపికా పేరు తొలగింపు



కల్కి సీక్వెల్‌లో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే (Deepika Pdukone) భాగం కావడం లేదని ప్రకటన వచ్చిన సమయం నుంచి పెద్ద చర్చే జరుగుతుంది. ముఖ్యంగా పనిగంటల విషయంలోనే విభేదాలు వచ్చినట్లు ప్రచారం జరిగింది. ప్రభాస్ స్పిరిట్ డీల్ విషయంలో కూడా తను రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేస్తానని చెప్పడం వల్లే వదులుకుందని తెలిసింది. అయితే, ఈ విషయంలో కొందరు నెటిజన్లు వైజయంతీ మూవీస్‌కు సపోర్ట్‌గా నిలిస్తే.. మరికొందరు దీపికా పదుకొనేకు అండగా నిలిచారు.

ప్రభాస్ , నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' (Kalki 2898 AD). గతేడాది విడుదలైన ఈ చిత్రం రూ. 1000 కోట్ల మార్క్ దాటి భారతీయ సినిమాకు అంతర్జాతీయ రేంజ్‌లో గుర్తింపు పొందింది. ఓటీటీలో కూడా ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే.. దీపికా పదుకొనే, వైజయంతీ మూవీస్ మధ్య ఏర్పడిన వివాదం వల్ల సినిమా ఎండ్ క్రెడిట్‌స్‌లో దీపికా పేరును తాజాగా తొలగించినట్లు తెలుస్తోంది. ఈమేరకు కొన్ని స్క్రీన్ షాట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.
అయితే, దీపికా పదుకొనే పేరు తొలగింపులో వైజయంతీ మూవీస్ పాత్ర లేదని కొందరు చెప్పుకొస్తున్నారు. ఓటీటీ సంస్థ నుంచి వచ్చిన కొన్ని గ్లిచ్స్ వల్ల ఆమె పేరు కనపడకుండా పోయిందని వివరణ ఇస్తున్నారు. ఇది కూడా హిందీ వెర్షన్‌లో మాత్రమే అలా వస్తుందని క్లారిటీ ఇస్తున్నారు. కానీ, తెలుగులో దీపికా పేరు క్లియర్‌గా కనిపిస్తుందని కూడా పేర్కొంటున్నారు. అయితే, చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.




# యష్ టాక్సిక్ వచ్చేది అప్పుడే..

'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్' (Toxic). యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీన్‌ఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19 2026లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియారా అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com